


# విజయభాను

45వ వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, బుధవారం 23-11-2022 VIJAYABHANU DAILY * VISAKHAPATNAM సంపుటి : 47 సంచిక : 60 పేజీలు : 09 వెల : 1 రూపాయి


## నేడు శ్రీకాకుళం జిల్లాలో సీఎం జగన్ పర్యటన



అమరావతి, (విజయభాను న్యూస్) : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో పర్యటించ నున్నారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష (రీసర్వే) పథకం కింద సర్వే పూర్తి అయిన గ్రామాలకు సంబంధించిన రైతులకు భూ హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించ నున్నారు.

ఉదయం 8.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి 11 గంటలకు నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానానికి చేరుకుంటారు. 11.00 నుంచి 12.55 వరకు బహిరంగ సభలో సీఎం ప్రసంగిస్తారు. లబ్ధిదారులకు పత్రాల పంపిణీ కార్యక్రమం అనంతరం మధ్యాహ్నం 1.25 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 3.25 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

## ఏపీ పెండింగ్ అంశాలపై నేడు కీలక సమావేశం




అమరావతి, (విజయభాను న్యూస్) : కేంద్ర కేబినెట్ సెక్రటేరియట్ ఆధ్వర్యంలో ఏపీ పెండింగ్ అంశాలపై నేడు కీలక సమావేశం జరగనుంది. కేబినెట్ సచివాలయంలోని కేంద్ర, రాష్ట్రాల సమన్వయ కార్యదర్శి నేతృత్వంలో ఈ సమావేశం ఏర్పాటు చేశారు. కేంద్రం నుంచి పెండింగ్‌లో ఉన్న అంశాల జాబితాను ఈ నెల మొదటివారంలోనే అందించాలని ఏపీని కేబినెట్ సెక్రటేరియట్ ఆదేశించింది. ఆయా మంత్రిత్వ శాఖల వద్ద ఏపీకి సంబంధించిన పెండింగ్ అంశాల జాబితాను కూడా కేబినెట్ సెక్రటేరియట్ కోరింది.

విభజన చట్టంలో ఏపీ కోసం ప్రత్యేకంగా ఇచ్చిన హామీలు, నెరవేర్చిన అంశాలు, ఇంకా పెండిం గ్‌లో ఉన్న వాటిపై తొలిసారి సమీక్ష జరపనున్నారు. ఉన్నత విద్యా సంస్థలు, ఎయిమ్స్, మౌలిక సదుపాయాలు, పోలవరం ప్రాజెక్టు, రైల్వే జోన్, ప్రత్యేక హెూదా, రాజధానిని హైదరాబాద్‌కు అను సంధానం చేయడం, కొత్త రాజధానికి ఆర్థిక సహకారం అందించడం వంటి వివిధ మంత్రిత్వ శాఖలకు చెందిన మొత్తం 34 పెండింగ్ అంశాలను కేంద్ర కేబినెట్ సెక్రటేరియట్ అజెండాలో పెట్టింది.

2016 సెప్టెంబర్ వరకే ఏపీ పెండింగ్ అంశాలపై తమ వద్ద జాబితా ఉందని స్పష్టం చేసింది.

పెండింగ్ అంశాల జాబితాను అప్డేట్ చేయాలని ఇప్పటికే రాష్ట్రానికి కేబినెట్ సెక్రటేరియట్ లేఖ రాసింది.



### ఈనెల 24న దివ్యాంగుల దర్శనం కోటా టికెట్ల విడుదల : తితిదే

తిరుమల, (విజయభాను న్యూస్) : ఈ నెల 24న దివ్యాంగుల దర్శనం కోటా టికెట్లు విడుదల చేయనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ఒక ప్రకటనలో తెలిపింది. వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు తిరుమల శ్రీవారిని దర్శించుకొనేందుకు 24న ఉదయం 10గంటలకు ఆన్‌లైన్‌లో ఉచిత ప్రత్యేక దర్శనం టికెట్లను విడుదల చేయనున్నట్లు పేర్కొంది. భక్తులు ఈ విషయాన్ని గమనించి ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకోవాలని తితిదే సూచించింది.



రాష్ట్ర సమాచార కమిషనర్ (ఆర్టీఐ ) ఉల్చాల హరి ప్రసాద రెడ్డి ని జిల్లా కలెక్టర్ డా. మల్లిఖార్జున పుష్ప గుచ్చం అంద జేసి మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర సమాచార కమిషనర్ (ఆర్ టి ఐ) మంగళ వారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్., కమిషనర్ ఆఫ్ పోలీస్ సి హెచ్ శ్రీకాంత్ మరియు డి సి పి సుమిత్ సునిల్ గరుడ్ వారిని మర్యాద పూర్వకంగా కలిశారు.



## ప్రభుత్వ చర్యల వల్ల ఇబ్బందుల్లో భవన నిర్మాణ కార్మికులు

### జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ నేపథ్యం.. గత చరిత్ర ఏమిటో అందరికీ తెలుసని, సీఎం పదవి ఆయనకు ముసుగులా ఉందని జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ విమర్శించారు. ఉమ్మడి విజయనగరం జిల్లా నియోజకవర్గ సమీక్షల కోసం విశాఖ విమానాశ్రయానికి వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం జగన్ చేసిన ఘనకార్యాలూ ప్రజలకు తెలుసని ఎద్దేవా చేశారు. ప్రజల పక్షాన నిత్యం పోరాడుతున్న వారికి సాయం చేస్తున్న జనసేన పార్టీకి సీఎం.. కాండక్ట్ సర్టిఫికెట్ అవసరం లేదన్నారు. "జనసేన పార్టీపై నోటికి వచ్చినట్లు సీఎం మాట్లాడటం తరువాయి 2లో..

## మూడో టీ20 టై.. టీమ్ ఇండియాదే సిరీస్

ఢీల్లీ : టీ20 ప్రపంచ కప్ తర్వాత ఆడిన తొలి టీ20 సిరీస్‌ను టీమ్‌ఇండియా కైవసం చేసుకొంది. భారత ఆటగాళ్లకు వరుణుడూ తోడు కావడంతో మూడు టీ20ల సిరీస్‌ను 1-0 ఆధిక్యంతో సొంతం చేసుకొంది. తొలి మ్యాచ్ రద్దు కాగా.. రెండో టీ20లో టీమ్‌ఇండియా ఘన విజయం సాధించింది. మూడో మ్యాచ్ డక్‌వర్త్‌లూయిస్ పద్ధతి ప్రకారం టైగా ముగిసింది. ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా సూర్యకుమార్ యాదవ్‌కు అవార్డు దక్కింది. నేపియర్ వేదికగా జరిగిన మూడో టీ20 మ్యాచ్ టైగా ముగిసింది. వర్షం కారణంగా మధ్యలోనే తరువాయి 8లో..



## పోడు భూముల పోరులో.. ప్రాణాలొదిలిన అటవీశాఖ అధికారి

### సీఎం దిగ్భ్రాంతి.. రూ.50 లక్షలు పరిహారం

### అటవీ అధికారులు మనోస్థైర్యం కోల్పోవద్దు: ఇంద్రకరణ్‌రెడ్డి



వార్త 2లో...

## సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల లో వంద శాతం బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలి

### -జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాధన్



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : సంక్షేమ వసతి గృహాలు , గురుకులాల లో వంద శాతం బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలని జాయింట్ కలెక్టర్ కె. ఎస్ . విశ్వనాథన్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్సీ,ఎస్టీ, బిసి సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, రెసిడెన్షియల్ స్కూల్ కోఆర్డినేటర్లు, ప్రిన్సిపల్స్ తో జాయింట్ కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ బయోమెట్రిక్ హాజరు నమోదు సరిగా లేదని, హాస్టళ్లలో బయోమెట్రిక్ ద్వారా 100 శాతం హాజరు నమోదు తరువాయి 2లో..



# ఆంధ్రప్రదేశ్ గిరిజన విలేకరుల నూతన కార్యవర్గం ఎన్నిక

- అధ్యక్షుడిగా అగతంబిడి రాజారావు,
- కార్యదర్శిగా గండేరు పారిజాతం
- కోశాధికారిగా తాంగుల మహేశ్వరరావు





**అల్లూరిజిల్లా, విజయభాను. పాడేరు న్యూస్:** ఆంధ్రప్రదేశ్ గిరిజన విలేకర్ల సంక్షేమ సేవా సంఘం అల్లూరి సీతారామరాజు జిల్లా స్థాయి నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం గిరిజన భవన్ లో పరిశీలకులు సి హెచ్ వి రమణ సమక్షంలో ఎన్నికలు సజావుగా జరిగింది. గౌరవ అధ్యక్షులుగా సి హెచ్ వి రమణ ఎన్నుకోబడగా, అధ్యక్షులుగా ఎ.రాజారావు, కార్యదర్శి గుండెరి.పారిజాతం, కో.. శాధికారి టి. మహేష్ లు ఏకగ్రీవంగాఎన్నుకోబడగా ఉప అధ్యక్షులుగా కె. శివశంకర్,ఉప కార్యదర్శిగా జె. శ్రీరామ్,పిఆర్ఓ డి. రామచంద్ర రావు, లీగల్ అడ్వైజర్ గా జి. మోహన్,కన్వీనర్స్ గా వి. జ్యోషి, కె. దుర్గ ప్రసాద్,లను ఎన్నుకొన్నారు. కాగా సంఘ సభ్యులు గా పి. సూర్య రావు, పి. సూర్యనారాయణ, టి. సునిల్ కుమార్, జె.రమణ, వి. మత్యలింగం, తదితరులు ఎన్నుకోబడ్డారు.

# గ్రీన్‌బెల్టు ఆక్రమణకు గురి కాకుండా చర్యలు చేపట్టండి



విశాఖపట్నం, (విజయభాను న్యూస్) : జివిఎంసి కమిషనర్ పి రాజాబాబు మంగళవారం ఉదయం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జోన్-2, 12వ వార్డు లోని ఆరిలోవ, చిన్నగాదిలి, సంతపాలెం తదితర ప్రాంతాలలో వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణితో కలసి పర్యటించారు. గ్రీన్ బెల్టును ఆక్రమించి ఉన్న చెత్త కొనుగోలు దుకాణం ను తొలగించి, అలాగే గ్రీన్ బెల్టు ఆక్రమణకు గురికాకుండా చూడాలని ఎసిపి ని ఆదేశించడమైనది. ముడసర్లోవ జివిఎంసి నర్సరీలో ఒక ప్రక్క నర్సరీ, ప్రక్కనే అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్(యుపిహెచ్ సి) నిర్మించాలని, మహిళల కొరకు మహిళా పార్కు కావాలని కార్పొరేటర్ కమిషనర్ ని కోరడమైనది, అలాగే కంపోస్ట్ యార్డు ఎదురుగా ఉన్న ఆట స్థలమునకు చుట్టూ ప్రహరీ గోడ, వాకింగ్ ట్రాక్ నిర్మించాలని, శ్రీ కాంత్ నగర్ లే-అవుట్ లో ఉన్న ఖాళీ స్థలాలను పార్కులుగా అభివృద్ధి చేయమని కమిషనర్ ని కార్పొరేటర్ కోరారు. కమిషనర్ కార్పొరేటర్ చెప్పిన వాటి అన్నింటికీ స్పందిస్తూ ఆయా అధికారులను అంచెలంచెలుగా అన్ని పనులను పూర్తి చేయాలని ఆదేశించడమైనది.

ఈ కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కెఎస్ఎల్జి శాస్త్రి, ఎఎంఓహెచ్ డాక్టర్ ఎన్. కిషోర్, కార్యనిర్వహక ఇంజినీరు మత్స్యరాజు, డిడి(హార్టికల్చర్) ఎం. దామోదర రావు, ఎసిపి శాస్త్రి, సహాయక కమిషనర్ పి. రమేష్, ఉప కార్యనిర్వహక ఇంజినీరు, సహాయక ఇంజినీర్లు, శానిటరీ సూపర్వైజర్, శానిటరీ ఇన్స్పెక్టర్లు, వార్డు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



మొదటి పేజీ తరువాయి

## ప్రభుత్వ చర్యల వల్ల ఇబ్బందుల్లో

# భవన నిర్మాణ కార్మికులు

విడ్డూరంగా ఉంది. సొంత నియోజకవర్గం పులివెందులలోనూ పరదాలు కట్టుకోకుండా పర్యటించలేని ఈ సీఎం కూడా మా పార్టీ గురించి మాట్లాడుతున్నారు. ప్రభుత్వ చర్యల వల్ల ఇబ్బందుల్లో ఉన్న భవన నిర్మాణ కార్మికులకు అండగా నిలబడి వారి కోసం పోరాటం చేశాం. డొక్కా సీతమ్మ ఆహార కేంద్రాల పేరుతో భోజనం అందించాం. ప్రపంచంలో ఏ రాజకీయ పార్టీ చేయని విధంగా ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతుల కుటుంబాలకు అండగా నిలబడ్డాం. అలాంటి మా పార్టీ పట్ల ముఖ్యమంత్రి దిగజారుడు వ్యాఖ్యలు ఆయన వ్యక్తిత్వాన్ని తెలియజేస్తున్నాయి. ప్రజలతో, ప్రజల కోసం ఎన్నుకోబడిన ముఖ్యమంత్రి ప్రజలకు కనిపించకుండా, పరదాలు కట్టుకొని, బారికేడ్లు పెట్టుకొని, దుకాణాలు మూయించి వేసి మరీ పర్యటనలకు రావడం ఎక్కడా చూడని వింత చర్య. స్కూళ్లు, కాలేజీలు మూయిస్తున్నారు. ప్రజలను దగ్గరికి రానివ్వకుండా పరిపాలించడం ఈ ముఖ్యమంత్రికే చెల్లుబాటు. అలాంటి వ్యక్తి జనసేన పార్టీకి సర్టిఫికెట్లు ఇవ్వాల్సిన అవసరం లేదు.

**మహిళలకు సీఎం జగన్ క్షమాపణ చెప్పాలి..**

వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ బహిరంగ సభలు పెట్టుకొని అదే ప్రభుత్వ గొప్పతనంగా ఈ ముఖ్యమంత్రి భ్రమపడుతున్నారు. సభకు వచ్చిన మహిళల నల్ల చున్నీలను సైతం బయటపెట్టి రమ్మనడం అత్యంత దురదృష్టకరం. ఈ చర్యలు కచ్చితంగా వారిని అవమానించడమే. సభకు మహిళలను బలవంతంగా తీసుకువచ్చి, బహిరంగంగా అవమానపర్చిన ఈ సీఎం మహిళలకు భేషరతుగా క్షమాపణ చెప్పాలి. చున్నీలు తీసేయాలి, పెన్నులు పడేయాలి అంటూ నిబంధనలు పెడుతున్న పోలీసులను ఏమి అనగలం. వారితో ఆ విధంగా చేయిస్తున్నది ఈ ముఖ్యమంత్రే. వ్యవస్థలను వాడుకుంటూ ప్రజలను మభ్యపెడుతూ పాలన చేస్తున్న జగన్‌పై ప్రజలు తిరగబడేందుకు సిద్ధంగా ఉన్నారు. గతంలో సీఎం సభలో పెన్నులు నిషేధించారు.. ఇప్పుడు మహిళలను కించపరుస్తూ చున్నీలు కూడా వద్దని చెప్పడం దారుణం. ప్రభుత్వ కార్యక్రమాల్లో విపక్షాలపై ఇష్టానుసారం విమర్శలు చేయకూడదని, నోరు పారేసుకోకూడదనే ఇంగిత జ్ఞానం ఈ సీఎంకు లేదు. ప్రజాధనంతో బహిరంగ సభలు పెట్టి రాజకీయ విమర్శలు చేయడం ఈయనకే చెల్లింది. ఇందులో పోలీసుల తప్పు ఉందని మేము భావించడం లేదు. పైనుంచి వచ్చిన ఆదేశాల్ని వారు పాటిస్తారు. కచ్చితంగా దీనిపై ప్రభుత్వ పెద్దలు మహిళలకు క్షమాపణలు చెప్పాలి.

**వైకాపా విముక్త ఏపీ కోసం ప్రజలు వేచి చూస్తున్నారు..**

విజయనగరం జిల్లాలోని సమస్యలపై, క్షేత్రస్థాయి పరిస్థితులపై, అధికార పార్టీ నేతల అవినీతిపై పూర్తిస్థాయిలో చర్చించేందుకు జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సూచనల మేరకు వారం రోజుల పాటు సమావేశాలు ఉంటాయి. విజయనగరం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల పరిస్థితులపై చర్చిస్తాం. ఈ ప్రభుత్వ పాలన మీద ప్రజలు విసిగిపోయి ఉన్నారు. అసమర్థత, అవినీతిలో కూరుకుపోయిన ఈ ప్రభుత్వాన్ని ఇంటికి పంపేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఉత్తరాంధ్రలో జనసేన పార్టీని బలోపేతం చేసేలా, ప్రజా సమస్యలపై పోరాడేలా పటిష్టమైన ప్రణాళికను సిద్ధం చేస్తాం. అధికార పార్టీ అరాచకాలకు అన్యాయాలకు ప్రజలు భయపడుతున్నారు. కచ్చితంగా ఎన్నికల్లో మాత్రం ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారు" అని నాదెండ్ల మనోహర్ అన్నారు.

# సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల లో వంద శాతం బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలి

అయ్యేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. గత వారం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి గారు హాస్టల్స్ తనిఖీ సమయంలో పలు లోపాలు గుర్తించారని, సంక్షేమ శాఖ అధికారులందరూ సరి చేసుకోవాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థికి ఐ.డీ కార్డ్ ఇవ్వాలన్నారు. రోస్టర్ లో లేని విద్యార్థులు హాస్టల్స్ లో ఉండరాదని, వారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్కూళ్లకు వెళ్లిన విద్యార్థులు సంఖ్య ,హాస్టళ్లలో ఉన్న విద్యార్థులు సంఖ్యలో ఎలాంటి వ్యత్యాసం ఉండకూడదన్నారు. చదువులో వెనుకబడిన పిల్లలకు సంబంధించి ప్రత్యేక శిక్షణ ఏర్పాటు చేయాలని అన్నారు. కొన్ని హాస్టల్స్ లో పిల్లల సంఖ్య తక్కువగా ఉన్నదని, ప్రత్యేక ప్రణాళిక రూపొందించి విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం క్రమం తప్పకుండా అందించాలని సూచించారు. వచ్చే సంవత్సరం 10 వ తరగతి ఫలితాలు మెరుగు పరచడానికి ఇప్పటినుండే ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్యపరీక్షలు చేయించి అందుకు సంబంధించి రికార్డులు పక్కాగా ఉంచాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో పరిశుభ్రత, పోషకాహారం, ఆరోగ్యం, నాణ్యమైన విద్య అందించేందుకు హాస్టల్ వెల్ఫేర్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు . ఇకపై తరచుగా తనిఖీలు చేస్తామని, విద్యార్థులకు ఎటువంటి సమస్యలు లేకుండా అధికారులందరూ చర్యలు చేపట్టాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ రమణ మూర్తి, బిసివెల్ఫేర్ అధికారిణి శ్రీదేవి, ఏపీ రెసిడెన్సియల్ కోఆర్డినేటర్ రూపవతి , కన్వీనర్ సత్యారావు ,హాస్టల్ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.

# పందులను నగరంలో లేకుండా చర్యలు తీసుకోవాలి



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని పందుల పెంపకం దారులు స్వచ్ఛందంగా తమ పందులను నగర పరిధి నుండి తరలించాలని జివిఎంసి కమిషనర్ పి. రాజాబాబు మంగళవారం తెలిపారు. ఈ రోజు జివిఎంసి కమిషనర్ ఆదేశాల మేరకు అన్ని జోన్ల నుండి వచ్చిన పందుల పెంపకం దార్లతో అదనపు కమిషనర్ వి. సన్యాసి రావు, వెటర్నరి డాక్టర్ కిషోర్ ఆధ్వర్యంలో పందుల నిర్మూలన కొరకు ప్రధాన కార్యాలయపు మీటింగ్ హాలులో సమావేశం నిర్వహించారు. పందుల పెంపకం వలన పర్యావరణానికి, నగర పరిశుభ్రతకు, ప్రజా ఆరోగ్యానికి తీవ్ర విఘాతం కలుగుతుందని, తిండి కోసం రోడ్ల మీద డస్ట్ బిన్లలో ఉన్న వ్యర్థాలను చిందర వందరగా పడవేస్తున్నాయని అంతేకాకుండా చిన్న పిల్లలు, ముసలి వాళ్ళు ఉన్న ఇళ్లలో ఆహారం కొరకు చొరబడి వారిని గాయపరిచిన సందర్భాలు ఉన్నాయని, పందుల పెంపకం దారులకు ఎన్ని పర్యాయములు హెచ్చరించిననూ పందులను నగరం నుండి తరలించడం లేనందున నవంబర్ 30వ తేదీ నాటికి నగరంలో పందులు ఉండకూడదని, అలా కనిపించిన యెడల గన్ మెన్లతో ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి పందులను కాల్చి చంపడం జరుగుతుందని తెలిపారు. అలా చేయని యెడల పందులు పెంపకం దారులపై బైండోవర్ కేసులు పెట్టడం జరుగుతుందని పందుల పెంపకం దార్లను హెచ్చరించారు. దీనిపై పందుల పెంపకం దార్లు స్పందిస్తూ పందులను స్వచ్ఛందంగా నగరం నుండి తరలిస్తామని తెలిపారు.

# పోడు భూముల పోరులో.. ప్రాణాలొదిలిన అటవీశాఖ అధికారి

భద్రాద్రి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పోడు భూముల వివాదం ఓ అధికారి ప్రాణాలు బలిగొంది. అటవీ భూములను కాపాడేందుకు ఎదురొడ్డిన అటవీ రేంజ్ అధికారి శ్రీనివాసరావు విధినిర్వహణలోనే ప్రాణాలు పోగొట్టుకున్నారు.

పోడుభూముల సాగుదారులు కత్తులు, గొడ్డళ్లతో విచక్షణారహితంగా దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన ఆయన్ను ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలోనే తుదిశ్వాస విడిచారు.

వివరాల్లోకి వెళితే.. చంద్రుగొండ మండలం బెండాలపాడు అటవీ ప్రాంతం ఎర్రబోడు సమీపంలో అటవీశాఖ అధికారులు నాటిన మొక్కలు తొలగించేందుకు మంగళవారం ఉదయం పోడుభూముల సాగుదారులు యత్నించారు. వారిని అడ్డుకోవడానికి వెళ్లిన అధికారులు శ్రీనివాసరావు, రామారావుపై మూకుమ్మడిగా దాడికి యత్నించడంతో బెండాలపాడు అటవీశాఖ సెక్షన్ అధికారి రామారావు అక్కడి నుంచి తప్పించుకున్నారు. మొక్కలు తొలగించవద్దని చెప్పే లోపే అక్కడే ఉన్న శ్రీనివాసరావుపై కత్తులు, గొడ్డళ్లతో ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. ఈ దాడిలో శ్రీనివాసరావు తీవ్రంగా గాయపడ్డారు. మెడ భాగంలో బలమైన గాయాలై తీవ్ర రక్తస్రావం కావటంతో వెంటనే ఆయన్ను చంద్రుగొండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడనుంచి అంబులెన్స్‌లో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో తుదిశ్వాస విడిచారు.

**సీఎం దిగ్భ్రాంతి.. రూ.50 లక్షలు పరిహారం**

గుత్తికోయల దాడిలో ఎఫ్ఆర్‌వో శ్రీనివాసరావు మృతి పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శ్రీనివాసరావు కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. దోషులకు కఠిన శిక్షలు పడేలా చూడాలని డీజీపీ మహేందర్ రెడ్డిని ఆదేశించారు. ఎఫ్ఆర్‌వో కుటుంబానికి రూ.50 లక్షలు పరిహారాన్ని సీఎం ప్రకటించారు. శ్రీనివాసరావు కుటుంబానికి పూర్తి వేతనం అందేలా చూడాలని.. కుటుంబసభ్యుల్లో అర్హులకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కేసీఆర్ ఆదేశించారు. ప్రభుత్వ లాంఛనాలతో శ్రీనివాసరావు అంత్యక్రియలు నిర్వహించాలని..

అంత్యక్రియల్లో పాల్గొనాలని మంత్రులు పువ్వాడ అజయ్, ఇంద్రకరణ్ రెడ్డిలను సీఎం ఆదేశించారు.

**అటవీ అధికారులు మనోస్థైర్యం కోల్పోవద్దు: ఇంద్రకరణ్‌రెడ్డి**

గుత్తికోయల దాడిలో రేంజర్ శ్రీనివాసరావు మరణించడం పట్ల అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పోడు భూముల సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంటే.. విధి నిర్వహణలో ఉన్న అధికారులపై దాడులు చేయడం సరికాదని పేర్కొన్నారు.

అటవీ భూముల ఆక్రమణలు సహించేది లేదన్న మంత్రి.. ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అటవీ అధికారులు మనోస్థైర్యం కోల్పోవద్దన్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి.. ఇలాంటి ఘటనలు భవిష్యత్‌లో చోటు చేసుకోకుండా చూస్తామని తెలిపారు.

# 66వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



గాజువాక(విజయభాను న్యూస్): నియోజక వర్గం జీవీఎంసీ 66వ వార్డ్ లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగింది. వార్డులో ప్రతీ గడపకు వెళ్లి ఈ మూడేళ్ళ పాలనలో ప్రజలకు ఎంత లబ్ది చేకూర్చామో వివరిస్తూ...

పథకాల ప్రాము ఖ్యతను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రజలకు వివరిస్తూ, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకొని సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమం వైకాపా తోనే సాధ్యం అని అన్నారు.

ఈ కార్యక్రమంలో వార్డ్ కార్పొరేటర్ ఇమ్రాన్, నాయకులు గౌస్, అలియను రాని,దుబాయ్ బాషా, పెదిరెడ్ల ఈశ్వరరావు, కరణం వేణు గోపాల రావు, షఫీ, మోతి,రెడ్డి జగన్నాధం, దేముడు బాబు,షేక్ ఆశ, వరలక్ష్మి, ఉమా దేవి, స్వాతి, ఫాతిమా, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, డ్వాక్రా ఆర్పీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైయస్సార్ కళ్యాణమస్తు పై సమగ్ర అవగాహన ఉండాలి

- డివిజన్ స్థాయిలో సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లకు డి ఎల్ డి ఓ ఉదయశ్రీ శిక్షణ కార్యక్రమం
- సంక్షేమ పథకాల అప్లోడ్ విషయంలో మాస్టర్ ఆఫ్ ట్రైనీలు సురేష్ నాయుడు, సుధీర్ అవగాహన
- మండలంలో జోరుగా సాగుతున్న డిజేబుల్ పెన్షన్ల ఎంక్వైరీ... పాల్గొన్న వివిధ శాఖల అధికారులు.






అనకాపల్లి జిల్లా నర్సీపట్నం(విజయభాను న్యూస్) : గ్రామ సచివాలయాలు వార్డు సచివాలయాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అప్లోడ్, సర్టిఫికెట్లు మంజూరు తదితర విషయాల్లో డిజిటల్ అసిస్టెంట్లు కు సమగ్ర అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డివిజనల్ డెవలప్మెంట్ అధికారిణి ఉదయశ్రీ ఆధ్వర్యంలో నర్సీపట్నం మండల పరిషత్ లో మంగళవారం జరిగింది. కార్యక్రమంలో మాస్టర్ ఆఫ్ ట్రైనీలు సురేష్ నాయుడు పీవీ సుధీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఈజీ ఆఫ్ లివింగ్, గ్రామస్తులతో సఖ్యతగా మెలిగేందుకు అవసరమైన పూర్తి సమాచారాన్ని కలిగి ఉండాలని తెలిపారు. వివిధ మండలాల నుండి డిజిటల్ అసిస్టెంట్లు కార్యక్రమంలో పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలో డిజేబుల్ పెన్షన్ ల ఎంక్వైరీ వివిధ శాఖల అధికారులు జోరుగా చేస్తున్నారు. ఎరకన్నపాలెం గ్రామంలో ఐకెపి ఎపిఎం పార్వతిబాయ్, చెట్టుపల్లి గ్రామంలో పరిపాలన అధికారి రమణబాబు తదితరులు విచిరణ నిర్వహించారు. ఎరకన్నపాలెం వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ చెట్టుపల్లిలో ఎంపీపీ భర్త ఇన్నం రమణ, సర్పంచ్ భర్త సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డిఎల్డీవో మాట్లాడుతూ సచివాలయాల్లో ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నామన్నారు.

# స్ఫూర్తి కార్యక్రమాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి

### మంప ఎస్సై లోకేష్‌కుమార్



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కొయ్యూరు(విజయభాను న్యూస్) : పోలీసుశాఖ, ఐటిడిఎల సమన్వయంతో నిర్వహిస్తున్న స్ఫూర్తి కార్యక్రమాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని మంప ఎస్సై లోకేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం కొయ్యూరు మండలం బూదరాళ్ల పంచాయతీ గరిమండ వారపు సంతలో, గరిమండ, అన్నవరం, గొర్లమెట్ట, కన్నవరం చుట్టుపక్కల గ్రామస్థులతో గిరిజన యువతతో ఎస్ఎస్సీ జెడి కానిస్టేబుల్ ఎగ్జామ్ నోటిఫికేషన్ పై అవగాహన కల్పించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎస్సీ జెడి కానిస్టేబుల్ నోటిఫికేషన్‌కు ఈ నెల 30 వరకు చివరి తేదీ అన్నారు. 10వ తరగతి పాసై 28 సంవత్సరాలు(ఎస్సీ, ఎస్టీ), ఎత్తు పురుషులు 162.5సిఎం, స్త్రీలు 150 సిఎం ఉన్న వారు అర్హులన్నారు. కావున అభ్యర్థులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి అప్లై చేసుకోవాలన్నారు. అప్లై చేసుకున్న వారికి స్ఫూర్తి కార్యక్రమం ద్వారా పోలీస్, ఐటిడిఎ వారి ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ, వసతి, భోజన సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. కావున ఈ అవకాశాన్ని యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# సత్యదేవుని నిత్యాన్నదాన ప్రధకానికి రూ.1,01,116/- విరాళం



అన్నవరం (విజయభాను న్యూస్): కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి కాకినాడ జిల్లా తొండంగి మండలం బెండపూడి గ్రామానికి చెందిన యస్.లక్ష్మికాంత్,శ్రీమతి మాధురి లు రూ.1,01,116/- విరాళమును దేవస్థానం పిఆర్వో కొండలరావు కు అందజేసి ప్రతీ సంవత్సరం దీనిపై వచ్చు వడ్డీతో మే 27వ తేదీన దుర్గామహాక్ష్మి,సహస్ర ల పేరున అన్నదానం జరిపించవలసిందిగా కోరారు.ఈ సందర్భంగా దాతలను పిఆర్వో కొండలరావు అభినందించారు.

# ఫ్యామిలీ డాక్టర్ విధానంలో డాక్టర్ అలేఖ్య సేవలు భేష్



అచ్యుతాపురం (విజయభాను న్యూస్) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ఉత్తమ సేవలు అందించిన అచ్యుతాపురం పిహెచ్ సి వైద్యాధికారిని బి అలేఖ్యను జిల్లా కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి అభినందించారు . ఫ్యామిలీ డాక్టర్ విధానంలో అనకాపల్లి జిల్లాలో ఉత్తమ వైద్య సేవలు అందించిన ఐదుగురు వైద్యాధికారులకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రశంస పత్రాలు అందజేసి సత్కరించారు. ప్రజల వద్దకు వెళ్లి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ అలేఖ్యను జిల్లా కలెక్టర్ ప్రశంస పత్రం అందజేసి సత్కరించారు.ఈ సందర్భంగా డాక్టర్ అలేఖ్యను జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, అనకాపల్లి జిల్లా డిఎంహెచ్ వో హేమంత్, ఫ్యామిలీ ఫిజీషియన్ జిల్లా ఇన్చార్జ్ డాక్టర్ జ్యోతి అభినందించారు. అలాగే అచ్యుతాపురం పిహెచ్ సి సిబ్బంది ఆమెను అభినందించారు.

# దీర్ఘకాలిక ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

### టీడీపీ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిని గాడు చిన్ని కుమారి లక్ష్మి



భీమునిపట్నం (విజయభాను న్యూస్) : ఎన్నో ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలుగుదేశం పార్టీ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సి అభ్యర్థిని గాడు చిన్ని కుమారి లక్ష్మి డిమాండ్ చేసారు. మంగళవారం జీవిఎంసీ ఎదురుగా ఉన్న గాంధీ పార్క్ వద్ద యు టి ఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొని ఉపాధ్యాయులకు సంఘీభావం తెలియజేసారు.ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా నేడు విద్యావ్యవస్థ రాష్ట్రంలో కుదేలయిందని అన్నారు. పాఠశాలల విలీనంతో అనేకమంది విద్యార్థులు బడులకు వెళ్లలేని పరిస్థితి దాపురించిందని అన్నారు.

అదేవిదంగా ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో రాష్ట్ర సర్కార్ పూర్తిగా కుదేలయిందని గాడు చిన్ని కుమారి లక్ష్మి అన్నారు.

# 27వ వార్డులో పర్యటించిన జోన్3 కమిషనర్ విజయలక్ష్మీ కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : జీవీఎంసీ 27వ వార్డులో జోన్-3 కమిషనర్ విజయలక్ష్మి, 27వ వార్డ్ కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి కలిసి అమర్ నగర్, సీబీఎం కాంపౌండ్, శ్రీనగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వీరారావు బుజ్జి వార్డులో ఉన్న పారిశుద్ధ్య, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ సమస్యలను జోనల్ కమీషనర్ దృష్టికి తీసుకుని వచ్చారు. వార్డులో ఉన్న ఎటువంటి సమస్యలు ఉన్నా సంబంధిత అధికారులు కార్పొరేటర్ సహాయంతో వెంటనే పరిష్కరించాలని సమస్యలు ఏమైనా మరీ ఇబ్బందికరంగా ఉంటే తన దృష్టికి తీసుకుని రావాలని ఆమె అధికారులను ఆదేశించారు. వార్డులో శానిటేషన్ ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండాలని ఇంజనీరింగ్ పనుల్లో నాణ్యత ఎక్కడా తగ్గడానికి వీలులేదని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో జోన్ ఎస్. ఎస్. వెన్నెల అప్పారావు, సీఎంహెచ్ఓ, టౌన్ ప్లానింగ్ అధికారులు, ఇంజ నీరింగ్ అధికారులు, శానిటేషన్ అధికారులు, వివిధ సచి వాలయ అడ్మిన్లు, కార్యదర్శులు, యూసీడీ సిబ్బంది, ఆర్పీలు, వార్డ్ టీడీపీ అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మి శివప్రసాద్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# గడపగడపకు మన ప్రభుత్వం పాదయాత్ర కార్యక్రమంలో పాల్గొన్న

### దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్

### 35వ వార్డు వైసిపి కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : దక్షిణ నియోజవర్గం 35 వార్డు పరిధిలో 209 సచివాలయంలో గడపగడపకు మన ప్రభుత్వం పాదయాత్ర కార్యక్రమంలో స్థానిక పేదల ప్రజాప్రతినిధి దక్షిణ నియోజకవర్గ రథసారథులు మత్స్యకార నాయకులు పేదల పక్షపాతి దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ మన 35 వ వార్డు పేదల ప్రజాప్రతినిధి స్థానిక 35వ వార్డు వైసిపి కార్పొరేటర్ వెల్లూరి భాస్కరరావు కలిపి చేసిన పాదయాత్రలో ప్రజలందరూ ఎదుర్కొంటున్న నీటి సమస్యను ఎమ్మెల్యేకి కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా సమస్యపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే గారు కార్పొరేటర్ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిసచివాలయం కి కేటాయించిన 20 లక్షల రూపాయలు నిధులతో...

సమస్యని సత్వరమే పరిష్కారం చేసి ఏదైతే డ్రింకింగ్ వాటర్ యూజుడి కంటెంప్ట్ అయిపోతుందో కంట మినేషన్ అవకుండా స్వచ్ఛమైన త్రాగునీరు ప్రజలకు అందించాలని సదుద్దేశంతో నూతన పైప్ లైన్ నిర్మాణ పనులు ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి

శంకుస్థాపన కీ ముఖ్య అతిథిగా వాసుపల్లి గణేష్ కుమార్, స్థానిక 35వ కార్పొరేటర్ విల్లూరు భాస్కరరావు చేతుల మీదగా కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది.

# జిల్లా అథ్లెటిక్స్ లో కాట్రేనికోన హై స్కూల్ విద్యార్థిని ప్రతిభ



కాట్రేనికోన (విజయభాను న్యూస్) : కాకినాడలో జరిగిన స్కూల్ గేమ్స్ఉమ్మడి జిల్లా స్థాయి అండర్17 బాలికల అథ్లెటిక్స్ లో కాట్రేనికోన జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థిని ఎం .స్వర్ణాంజలి ప్రతిభ కనపరిచింది. ఆమెలాంగ్ జంప్ విభాగంలో మూడవ స్థానం, హై జంప్ విభాగంలో నాలుగో స్థానం సాధించింది. అలాగే అండర్ 17 బాలురు విభాగంలో 200 మీటర్స్ నాలుగో స్థానం, 400 మీటర్ నాలుగవ స్థానం లో పాఠశాల విద్యార్థి మల్లాడి సింహాద్రి నిలిచారు. మంగళవారం విజేతలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె .వెంకటేశ్వరరావు, పాఠశాల అభివృద్ధి కమిటీచైర్మన్ గిడ్ల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

# సత్యదేవుడ్ని దర్శించుకున్న రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ



అన్నవరం (విజయభాను న్యూస్) : కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారినిరాజ్యసభ సభ్యులు మోపిదేవి. వెంకటరమణ శ్రీ స్వామివార్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆయనకు ఆలయ కార్యనిర్వహణ అధికారి సత్యనారాయణమూర్తి, పిఆర్ఓ కొండలరావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు.

# విజయభాను
## సంపాదకీయం

### మనిషి మనసు కోరికల పుట్ట

ఆకలి కడుపు, ఖాళీ జేబు, విరిగిన మనసు నేర్పినన్ని పాఠాలు ఎవరూ నేర్పలేరు' అంటారు. ఆకలి కడుపు జీవితంలో ఆహారం విలువను తెలియజేస్తే... ఖాళీ జేబు చేతిలో చిల్లిగవ్వ లేని సమయంలో పొదుపు చేయలేకపోయామే అన్న వేదనను మిగుల్చుతుంది. 'బూంద్ బూంద్ బనేగా సముందర్, పైసా పైసా జమాతో రుపయా హెూయేగా' అనేది హిందీలో ఒక సామెత. ఒక్కొక్క బిందువు కలిస్తేనే మహాసముద్రం... పైసా పైసా కలిస్తేనే రూపాయి అవుతుందని దాని అర్థం. జీవితమనే బండిని సాఫీగా నడిపేందుకు అవసరమైన ఇంధనమే 'ధనం'. ఆదాయానికి మించి ఖర్చు చేయకుండా, రేపటి ఆనందమయ జీవితం కోసం...భవిష్యత్తు అవసరాల కోసం పక్కన పెట్టే చిన్నచిన్న మొత్తాలే పొదుపు. ఇవన్నీ జీవితంలో పొదుపు ఎంత ముఖ్యమో...తెలియజెప్పే సూత్రాలు. రూపాయి అంటుందిట- 'నన్ను వంద వరకూ పెంచు' తర్వాత నిన్ను నేను పెంచుతా' అని. అదే రూపాయిని చిల్లరగా మార్చితే చెల్లాచెదురవుతాయి. అదే చిల్లరను ఒక దగ్గర జమ చేస్తూపోతే ధన సమూహంగా మారుతుంది. అందుకే పొదుపు...భవిష్యత్తు నిర్మాణానికి తొలిమెట్టు.

మనిషి మనసు కోరికల పుట్ట. కోరికలన్నింటిని తీర్చుకోవటం ఎవ్వరికీ సాధ్యపడదు. ముఖ్యంగా డబ్బు, ఆహారం, వస్త్రాలు, విశ్రాంతి, సమయం, శక్తి, భాషణం, భూషణం- అనే ఈ ఎనిమిది విషయాలందు పొదుపును పాటించాలి. లేదంటే జీవితం అభాసుపాలవుతుంది. 'చక్రవర్తికి వీధి బిచ్చగత్తెకి/ బంధువవుతానని అంది మనీ మనీ/ అమ్మ చుట్టము కాదు అయ్య చుట్టము కాదు/ ఐనా అన్ని అంది మనీ మనీ/ పచ్చనోటుతో లైఫ్ లక్ష లింకులు పెట్టుకుందని/ అంది మనీ మనీ' అంటాడో సినిమా కవి. అనవసరమైన ఖర్చులు మానేసి, జాగ్రత్తగా ఖర్చు పెట్టుకునే వారిని చూసి పిసినారి అంటారు. అలాగని బిందాస్‌గా వ్యవహరిస్తే జల్సా అంటారు. అందుకే ఎవరో ఏదో అంటారని, ఎవరో ఒకరు ఆదుకోకపోతారా అని నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదు. 'నీ మనసుని, శరీరాన్ని ఆరోగ్యంగా అట్టేపెట్టని ఖర్చు ఒక్క దమ్మిడీ చెయ్యకు' అంటాడు కొడవటిగంటి. వ్యక్తులు, కుటుంబాలకే కాదు...ఇది పాలకులు, ప్రభుత్వాలకు కూడా వర్తిస్తుంది. ప్రజల సొమ్మును, ప్రకతి వనరులను కార్పొరేట్లకు దోచిపెడుతూ...లక్షల కోట్ల అప్పులతో ప్రభుత్వాలను నడుపుతున్నారు. సంస్కరణల పేరుతో ప్రజల ముక్కుపిండి వసూలు చేస్తూ...కార్పొరేట్లకు మాత్రం కోట్లాది రూపాయల రాయితీలిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో...అరకొర ఆదాయాలతో బతకడానికే ఆపసోపాలు పడుతుంటే...పొదుపు ఎలా చేయాలి? అనేది పెద్ద ప్రశ్నగా మారింది. నయా ఉదారవాద ఆర్థిక విధానాల పుణ్యమాని... ప్రపంచంలో వినిమయదారీ సంస్కృతి విపరీతంగా పెరిగింది. చేతిలో పైసా లేకపోయినా, మధ్యతరగతి జీవితాలను ఆశల పల్లకిలో విహరింపజేస్తూ...క్రెడిట్ కార్డులు, ఇఎంఐ ల రూపంలో వున్నదంతా ఊడ్చేస్తున్నారు. 'అప్పు తెచ్చి వేసిన మిద్దెల్లో/ కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్న దీనత్వం నీది' అంటాడు చెరబండరాజు. ఆ దీనత్వం నుంచి బయటపడేసేదే పొదుపు. పొదుపు అలవాటుని ప్రజల్లో కలిగించడం కోసమే ప్రతి సంవత్సరం అక్టోబర్ 31న 'ప్రపంచ పొదుపు దినోత్సవం' జరుపుకుంటున్నారు.

పొదుపు అన్ని విషయాలకూ వర్తిస్తుంది. 'పొదుపు తెలిసిన గృహిణి కాపురం పచ్చని సంసారమే' అంటారు పెద్దలు. ఇంటి అవసరాల కోసం వచ్చే ఆదాయాన్ని బట్టి బడ్జెట్ తయారుచేసుకోవాలి. పొదుపు కోసం కొంత మిగుల్చుకోవాలి. ఈ అలవాటు ప్రారంభంలో కొంత కష్టమనిపించినా...తినగ తినగ వేము తీయనుండు అన్నట్టుగా తర్వాత్తర్వాత సులభమవుతుంది. 'ఇదమే వహి పాండిత్యం/ ఇదమే వహి శూరత/ ఇదమే వహి వైదగ్ధ్యం/ ఆదాదల్పతరో వ్యయ్ణ' అన్నారు. ఆదాయం కన్నా చాలా తక్కువ ఖర్చుపెట్టడమే... ఏ మనిషి విజ్ఞానానికైనా, శూరత్వానికైనా, నేర్పుకైనా నిదర్శనం- అని ఈ శ్లోకం చెబుతుంది. పొదుపు అంటే ఒక్క డబ్బు విషయంలోనే కాదు- కాలం, వనరులు, నీరు, చెట్టు, విద్యుత్, ఆహారం వంటి అన్నిటిలోనూ అవసరమే. డబ్బుతో పాటు ఈ ప్రకృతి వనరులు ఏ ఒక్కటి వృధా అయినా... దాని ఫలితం భవిష్యత్తరాలు ఎదుర్కోవాల్సి వుంటుంది. 'ఉన్ననాడు తెలివి కలిగి పొదుపు చేయరా/ లేనినాడు ఒడలు వంచి కూడబెట్టరా/ కొండలైన కరిగిపోవు కూర్చుని తింటే/ అయ్యో కూలిపోవు కాపురాలు ఇది తెలియకుంటే...' అంటాడు ఆరుద్ర. అనవసరమైన ఖర్చును తగ్గించుకొని, రేపటికోసం కొంత దాచాలన్నది పెద్దలు చెప్పే ఆర్థిక సూత్రం. ఈ సూత్రంపైనే కుటుంబ భవిష్యత్తయినా, దేశ భవిష్యత్తయినా ఆధారపడి వుంటుంది.



శ్రీశ్రీశ్రీ కనకమహాలక్ష్మీ అమ్మవారి మార్గ శిర మాసోత్సవముల హాఆహ్వాన పత్రికను మంగళవారం బాలయ్యశాస్త్రి లేఔట్ లో రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు కు దర్మకర్తలమండలి సభ్యులు అందజేసారు. ఈనెల 24వ తేది నుండి డిసెంబరు 23 తేది వరకు జరుగు అమ్మవారి పూజా కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.
ఈ కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్పర్సన్ కొల్లి సింహాచలం, సభ్యులు వంకాయల మారుతీ ప్రసాద్ , సతీష్ , వెంకటరత్నం , రవి తదితరులు పాల్గొన్నారు.

## హరే కృష్ణ మూవ్మెంట్ నిర్వహించు లక్ష దీపోత్సవం



విశాఖపట్నం : లక్ష దీపోత్సవం 19 వ తేదీ నవంబర్ 2022 నుంచి 23 నవంబర్ 2022 వరకు 5 రోజుల పాటు సాయంత్రం 6 గంటలకు ప్రారంభం వైకుంఠం మందిర నిర్మాణ ప్రదేశం , ఆర్ టీ ఓ ఆఫీస్ రోడ్ , సెర్వే నెంబర్ 152/2 మరియు సర్వే నెంబర్ 152/8 , అక్షయ పాత్ర ఫౌండేషన్ వంటశాల కు ప్రక్కన , గంభీరం , ఆనందపురం నందు అంగరంగ వైభోగముగా రొండోవ రోజు లక్ష దీపోత్సవం నిర్వహించడం జరిగింది . నాలుగోవ రోజు 22-11-2022 భక్తులు అధిక సంఖ్యలో లక్ష దీపోత్సవములో పాలుగున్నారు. అంగరంగ వైభోగముగా రంగురంగులతో రంగవల్లి అందులో దీపాలతో అలంకరించి దీపారాధ చేయడం జరిగింది ఈకార్యక్రమములో డాక్టర్ నిష్కించిన భక్తదాస ప్రెసిడెంట్ హరే కృష్ణ మూవ్మెంట్ భక్తులకు కార్తీక మాసము మరియు దీపోత్సవం ప్రముఖతను వివరించారు .

లక్ష దీపోత్సవం లో ఈ రోజు నిర్వహించిన కార్యక్రమాలు :

1.ఆకాశదీపం

2.అఖండ దీపం 3.తోలి దీపం 4.భక్తుల చే లక్ష దీపోత్సవం 5 రోజులు నిర్వహించు కార్యక్రమాలు సాయంత్రం 6.00 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు సాయంత్రం 6.30 నిముషములకు తులసి ఆహారతి సాయంత్రం 6.45 నిముషములకు ఆకాశ దీపం రాత్రి 7.00 గంటలకు తొలిదీపం మరియు అఖండ దీపం రాత్రి 7.30 నిముషములకు దామోదర హారతి మరియు లక్ష దీపోత్సవం భక్తుల చే 8 గంటలకు ప్రసాద వితరణ

**కార్తీక మాసములో శ్రీకృష్ణభగవానుని ఆరాధన:**

ఈ వ్రతము నియమాలు:

- ప్రతి రోజు శ్రీకృష్ణుని ఆలయాన్ని సందర్శించాలి. -ప్రతి రోజు శ్రీకృష్ణునికి నెయ్యి దీపం అర్పించాలి.
- శ్రీ కృష్ణద్వైపాయన వ్యాసమహర్షి రచించిన పద్మ పురాణము లోని దామోదర అష్టకాన్ని ప్రతి రోజు పాడాలి.
- దానము చేయుట.- తులసి దేవికి పూజ చేయుట మొదలైనవి.

నెయ్యి దీపంతో శ్రీకృష్ణుని ఆరాధించుట కార్తీక మాసంలో అత్యంత ముఖ్యమైనది. శాస్త్రాలలో ఈ విధంగా చెప్పబడింది "అన్ని బహుమానాలలో, కృష్ణునికి నెయ్యి దీప బహుమానము కార్తీక మాసములో ఉత్తమమైనది. దీనికి సమానమైన బహుమానము మరొకటి లేదు." "ఎవరైతే శ్రీహరి ఆలయంలో కార్తీక మాసంలో కొద్దిసేపైన దీపారాధన చేస్తారో అతను అనేక కల్పముల (ఒక కల్పము అనగా 1000 యుగాలు) పాప ఫలితము నుంచి విముక్తి పొందుతాడు. "

కార్తీక వ్రతాన్ని గురించి అన్ని పురాణాలలో విశిష్టంగా చెప్పబడింది. ఈ వైభవాన్ని గుర్తించి భక్తులందరూ భగవంతుని సంతృప్తి కొరకు మరియు శాశ్వత శ్రేయస్సు ఆశిస్తూ కార్తీక వ్రతాన్ని ఘనంగా ఆచరిస్తారు. ఇదే నెలలో గోవర్ధన పూజ, రాసలీల, దీపావళి మొదలగు అనేక ప్రాశస్త్యమైన శ్రీ కృష్ణ లీలలు జరిగినవి.

ప్రతి రోజు సాయంత్రం నెయ్యి దీపారాధన మరియు ఆత్మకు హత్తుకునే రీతిలో సంగీత వాయిద్యాలతో శ్రీ దామోదరష్టకము భజన కార్యక్రమము ఉంటుంది. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకొని భగవంతుని భక్తి పారవశ్యములో ఆనందించగలరని ఆశిస్తున్నాము. హరే కృష్ణ వైకుంఠం మందిరం శ్రీకారం : డాక్టర్ ఎస్.వీ.ఆదినారాయణ గారు మరియు డాక్టర్ శశి ప్రభ దంపతులు విశాఖపట్నం లో హరే కృష్ణ మూవ్మెంట్ సేవలను గుర్తించి సుమారు 3 ఎకరాలు స్థలమును గంభీరం గ్రామము సర్వ్ నెంబర్ 152/2 మరియు 152/8A లో అక్షయ పాత్ర ఫౌండేషన్ వంటశాల కొరకు 2013 సంవత్సరము ఇవ్వడం జరిగింది . ఈ ప్రదేశములో అక్షయపాత్ర ఫౌండేషన్ వంటసాలను నిర్మించి 2019నుంచి ఆనందపురం మరియు ,భీమునిపట్నం మండలంలో సుమారు 20000 వేలమంది 174 ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు భోజనం పంపడం జరుగుతుంది .

ఈ కార్యక్రమము కనులార చూచిన డాక్టర్ ఎస్.వీ.ఆదినారాయణ గారు మరియు డాక్టర్ శశి ప్రభ దంపతులు హరే కృష్ణ వైకుంఠం మందిర నిర్మాణం కొరకు 2020 సంవత్సరము లో మరో రొండు ఏకరములు గంభీరం గ్రామము సర్వ్ నెంబర్ 152/2 మరియు 152/8A లో ఇవ్వడం జరిగింది . ఈ రోజు హరే కృష్ణ వైకుంఠం లో భక్తులకు అందుబాటులో లక్ష దీపోత్సవం ను 19 వ తేదీ నుంచి 23 వ తేదీ వరకు నిర్వహించడం జారుకు తుంది . ఈ హరే కృష్ణ వైకుంఠం మందిరం కు స్థలమును కేటాయంచిన డాక్టర్ ఎస్.వీ.ఆదినారాయణ గారు మరియు డాక్టర్ శశి ప్రభ దంపతులు కు డాక్టర్ నిష్కించిన భక్తదాస హరే కృష్ణ మూవ్మెంట్ ప్రెసిడెంట్ ధన్యవాదములు తెలిపినారు .

## కవి సమయం

### కన్న ఋణం-పరమ భాగ్యం

ప్రపంచమంటే... పూజ్యమం
పదిలం, పదిలం, పదిలం
ప్రపంచ మంటే... జీవులు
పదిలం, పదిలం, పదిలం.
బిడ్డ కలిగితే... సెగను కాపుతు
ఉగ్గును కుడిపి... ముద్దులొలుకుతు
చనుబాలును పెట్టి... బుజ్జి నెరుముతు
లాలల పాడి... బొద్దుగ ముద్దు.
కానుపు యిచ్చే తల్లి...
కాసిన ఋణమే ప్రేమ
తల్లి, తండ్రి ప్రేమ...
ఇంత పెంచితే...? ఎంతవరకు బంధం
అంతవారికి... ఎంతవరకు సొంతం
ముసలితనముకూ... చెయ్యూత లేనిదారి
దాతలు పెట్టే... నీడ పట్టుమాది.
కడసారి చూపుకు... కన్నబిడ్డలేరి
ఋణము తీర్చుకున్న... మోసునోళ్ళు వేరె
ప్రపంచమంతా... ఏమి యీలాగుందా?
కొంతవరకు మాత్రమే... ఔనంటుందా?
మరి, కొంతమట్టుగా... కాదంటుందా?
మనసు మరుపులేక రక్తసొరుసుమాది
కన్నవారి సేవే - పరమ భాగ్యమంది
ఎంతమట్టుగా - పుణ్యమంటుంది?
సమాజమా... ఇలా... అలా....గుంది.

...కవితా రచన
మజ్జి శ్యామసుందరరావు

## పంచాంగం

అమావాస్య తె.4.39; విశాఖ రా.10.13; రా.వ.2.04ల 3.36. | బుధవారం 23-11 -2022

a **మేషం** : ఆత్మీయులకు విలువైన కానుకలు అందజేస్తారు. ఉద్యోగస్తులు విశ్రాంతికై చేయు యత్నాలు అనుకూలిస్తాయి. ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణాలు మంచిది కాదు. b **వృషభం** : దీర్ఘకాలికంగా ఆగిపోయిన ధనం చేతికి వస్తుంది. లక్ష్య సాధనపై దృష్టి పెట్టడానికి సరైన సమయం. స్థిరాస్తుల అభివృద్ధి, కొనుగోలు యత్నాల విషయాలలో పునరాలోచన అవసరం. c **మిథునం** : ఆర్థిక పరిస్థితి నిరాశ పరుస్తుంది. వృత్తి, వ్యాపారాలు సజావుగా సాగుతాయి. దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. బంధు మిత్రుల నుంచి విమర్శలు ఎదుర్కొంటారు. స్త్రీలు షాపింగ్ వ్యవహారాల్లో అపరిచిత వ్యక్తుల పట్ల మెళకువ అవసరం. d **కర్కాటకం** : ఆర్థిక వ్యవహారాలు నిరుత్సాహకరంగా ఉంటాయి. రాజకీయ కళా రంగాల వారికి విదేశీ పర్యటనలు అనుకూలిస్తాయి. ప్రముఖుల కలయికతో ఒక వ్యవహారం సానుకూలం అవుతుంది. కాంట్రాక్టులు దక్కుతాయి. మీ సంతానంతో ఉల్లాసంగా గడుపుతారు. నిరుద్యోగలకు ఇంటర్వ్యూలలో మెళుకవ అవసరం. ఖర్చులు అధిక మవుతాయి. e **సింహం** : అవగాహన లేని విషయాలకు దూరంగా ఉంటే మంచిది. స్త్రీలకు పరిచయాలు, వ్యాప కాలు అధికమవుతాయి. f **కన్య** : నిరుద్యోగులు ఇంట ర్వ్యూల్లో రాణిస్తారు. మీ శ్రమకు తగిన గుర్తింపు, ప్రతిఫలం లభిస్తాయి. మీ మాటకు ఇంటా బయటా ఆదరణ పెరుగు తుంది. చేపట్టిన పనుల్లో స్వల్ప ఆటం కాలు ఎదుర్కొంటారు. మీ వాహనం ఇతరులకిచ్చి ఇబ్బందు లెదుర్కొంటారు. g **తుల** : నూతన పరిచయాలు, సంబంధ బాంధవ్యాలు మీ పురోభివృద్ధికి ఎంతగానో సహ కరిస్తాయి. వృత్తి వ్యాపారాలలో ఆటంకాలను అధికమిస్తారు. స్త్రీలకు ఆరోగ్యంలో మెళకువ అవసరం. నిరుద్యోగులకు అశాజనకం. h **వృశ్చికం** :స్త్రీలు పని దృష్ట్యా ఒత్తిడి, చికాకులకు ఎదుర్కొంటారు. ఏ విషయంపై అయినా స్పందించే ముందు పరిణామాలు ఎలా ఉంటాయో మరొక్కసారి ఆలోచించండి. చేతి వృత్తుల వారికి సదావకాశాలు లభిస్తాయి. ప్రేమికులకు పెద్దల నుంచి ప్రోత్సా హం, సన్ని హితుల సహకారం ఉంటాయి. నిరుద్యోగులు నిరాశ, నిస్పృహలకు లోన వుతారు. i **ధనుస్సు** :ఆర్థిక వ్యవహారాలు, నూతన పెట్టుబడులకు సంబంధించి స్పష్టమైన నిర్ణయానికి వస్తారు. నిరుద్యోగులకు మధ్యవర్తుల పట్ల అప్రమత్తత అవసరం. స్త్రీలు, గృహోప కరణాలకు కావలసిన వస్తువులను కొనుగోలు చేస్తారు. దూర ప్రయాణాలలో కొత్త పరిచయాలు ఏర్పడ తాయి. మీ మనసుకు ఊరట, ఉల్లాసం కలిగించే సంఘటనలు జరుగు తాయి. j **మకరం** : మనసులో భయాందోళనలూ అను మానాలూ ఉన్నా, ఢాంభికం ప్రదర్శించి పనులు సాఫీగా పూర్తి చేస్తారు. మీ అభిప్రాయాలకు తగిన వ్యక్తితో పరిచయాలేర్పడతాయి. స్వయంకృషితో వ్యాపారాలలో బాగా రాణిస్తారు. మీ సంతానంతో ఉల్లాసంగా గడుపుతారు. k **కుంభం** : వృత్తి కళా రంగాలలో మీ ప్రాధాన్యత అధికమవుతుంది. అనుకోని మార్పులు ఏర్పడ టంతో రోజువారీ మీ కార్యక్రమాలు సకాలంలో జరుగక అసహనం పెరుగుతుంది. హోటల్, క్యాటరింగ్ వ్యాపారులకు లాభం చేకూరుతుంది. L **మీనం** : ఇంటా బయటా కూడా తలపెట్టుకున్న పనులకు ఆటంకాలు తప్పక పోవచ్చు. ప్రచార సాధనాలు, రవాణా రంగాల్లో మీ పెట్టుబడులు సత్ఫలితాల నిస్తాయి.

# గిరిజన ప్రాంత అభివృద్ధే లక్ష్యం : ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర







అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు లోయ (విజయ భాను న్యూస్ ): గిరిజన ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, సంక్షేమ శాఖ మంత్రి పీడీక రాజన్న దొర అన్నారు. ఈ సందర్భంగా ఆయన రూ.3.76కోట్ల వ్యయంతో నిర్మించిన కిల్లోగుడ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఈ సందర్భంగా అరకు శాసనసభ్యులు చెట్టి పాల్గుణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఏర్పాటుచేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా అవినీతిరహితంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాలను అమ్ములు చేస్తోందని చెప్పారు. సంక్షేమ వసతి గృహాల్లో నాణ్యమైన మెనూ అందిస్తున్నారని అన్నారు. చిన్నప్పుడు నేను కూడా హాస్టల్లోనే చదువుకున్నానని నాణ్యత లేని ఆహారాన్ని పెట్టేవారని చెప్పారు. మన పక్క రాష్ట్రం ఒరిస్సాలో రూ 500 పెన్షన్ ఇస్తుంటే మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి 2500 పెన్షన్ ఇస్తున్నారని వచ్చే జనవరి నుండి రూ. 2750 కి పెంచుతున్నారని పేర్కొన్నారు. నాబార్డ్ నిధులు రూ.147 కోట్లతో 577 రహదారులను నిర్మిస్తున్నామన్నారు. రూ. కోట్లతో 500 భవనాలు నిర్మాణం చేపట్టి 252 పూర్తి చేయడం జరిగిందన్నారు. రూ.79 కోట్లతో 354 రైతు భరోసా కేంద్రాలు, రూ.39 కోట్లతో 230 వెల్నెస్ సెంటర్లను నిర్మాస్తున్నామన్నారు. 730కోట్లతో 985రోడ్లు నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో ఖాళీలు భర్తీ చేయడానికి చర్యలు చేపట్టామన్నారు. సంక్షేమ వసతి గృహాలు మెనూ త్వరలో మారుస్తున్నామని అన్నారు. విద్యార్థులకు జగనన్న కిట్లు అమ్మబడి అందిస్తున్నామని చెప్పారు. సభాధ్యక్షులు అరకు శాసనసభ్యులు చెట్టి పాల్గుణ మాట్లాడుతూ 1లక్ష 10వేల 645 మంది లబ్ధిదారులకు అటవీ హక్కు పత్రాలు పంపి చేయడం జరిగిందన్నారు. రూ.232 కోట్లతో 15.506 మంది పిల్లలతో ఏర్పాటు చేస్తామన్నారు. మజ్జివలస,బస్కి , భూసిపుట్టు, పెద్ద కోడపల్లి గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నిర్మిస్తామన్నారు. అలాగే ముంచంగిపుట్ మండలం సృజన కోట లో రూ.4 కోట్ల రూపాయల వ్యయంతో వెల్నెస్ సెంటర్ నిర్మాణానికి ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారని ఆయన అన్నారు. అరకులోయ నియోజకవర్గంలోని 6 మండలాలో రూ 510 కోట్ల వ్యాయంతో 20050 ఒకటి రోడ్లు నిర్మించనున్నట్లు ఆయన అన్నారు. అలాగే రణ జల్లెడ లో రూ.96. లక్షలతో మినీ రిజర్వాయర్ నిర్మిస్తామని ఆయన తెలిపారు. అనంతరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రోనాంకి గోపాలకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, గిరిజన విద్యార్థులు విద్య సదుపాయాలను సద్వినియోగం చేసుకొని విద్యా కుసుమాలుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. పాడేరులో రూ 500 కోట్లతో వైద్య కళాశాల నిర్మాణం సరవేగంగా జరుగుతుందని ఆయన అన్నారు. పాడేరు జిల్లా ఆస్పత్రిలో ఇప్పటికే 1030 ఆపరేషన్లు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షురాలు జల్లిపల్లి సుభద్ర, గిరిజన సహకార సంస్థ చైర్పర్సన్ శోభ స్వాతి రాణి, ట్రైకర్ చైర్మన్ సతక బుల్లి బాబు, సబ్ కలెక్టర్ వి. అభిషేక్, గిరిజన సంక్షేమ శాఖ డిడి ఐ.కొండలరావు, ఈ ఈ కే. వేణుగోపాల్. స్థానిక మండల తహసీల్దార్ ఏ. వేణుగోపాల్. తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ టిడ్కో ఛైర్మన్ జమ్మన ప్రసన్నకుమార్ సుడిగాలి పర్యటన





పరవాడ (విజయభాను న్యూస్): ఏపీటిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ అధికారిక పర్యటనలో భాగముగా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలో రాతి చెరువు పరవాడ మరియు ఎలమంచిలిలో టిడ్కో గృహ సముదాయాలలో నిర్మితం అవుతున్న గృహ సముదాయాలలో బయో ఫెన్సింగ్ విధానములో మిలినీయం ప్లాంటేషన్ లో భాగంగా పచ్చదనం మరియు పర్యావరణ పరిరక్షణ పెంపొందించే దిశగా చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమంలో రెడ్ క్రాస్ సెక్రెటరీ శ్రీ.పి.రవి కుమార్ గారు.విజయ్ నిర్మాణ కంపెనీ ప్రతినిథులు మరియు టిడ్కో ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పాల్గొనడం జరిగింది .తదుపరి టిడ్కో హౌసింగ్ యొక్క నిర్మాణ పనుల యొక్క ప్రగతిని గూర్చి అధికారులను మరియు కాంట్రాక్టింగ్ ఏజెన్సీ సిబ్బందిని అడిగి తెలుసుకొవడం జరిగింది.

ఈ కార్యక్రమంలో 500 మొక్కలు ఇచ్చిన రెడ్ క్రాస్ సంస్థ వారికి 800 మొక్కలు ఇచ్చిన విజయ్ నిర్మాణ కంపెనీ వారికి మొక్కలు సమకూర్చి ప్లాంటేషన్ అయ్యే విధముగా సమ న్వయము చేసినటువంటి సి.ఎల్.టి.సి వారికి, ఇంజనీరింగ్ సిబ్బందికి మరియు కాంట్రాక్టింగ్ ఏజెన్సీ వారికి అభినందనలు తెలియజేయడం జరిగింది.

అనంతరం రెడ్ క్రాస్ ప్రతినిధులకు నిర్మించిన టిడ్కో గృహ సముదాయాలలో నిర్మాణ తీరును కల్పిస్తున్నటువంటి సదుపాయాలను మరియు నాణ్యతను గురుంచి విపులముగా వివరించారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ ఛైర్మెన్ ని దుశ్శాలువాతో ఘనముగా సత్కరించడం జరిగింది.తదుపరి కాంట్రాక్టింగ్ ఏజెన్సీ వారిని (హౌసింగ్ మరియు ఇన్ఫ్రా) ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దే శించిన గడువు లోపు పూర్తి సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ తో సహా అన్ని సదుపాయాలతో ఇళ్లను నిర్మించి లబ్దిదారు లందరకు ఇళ్ళు అందించే విధముగా కార్యాచరణను రూపొందించాలని తెలియజేయడం జరిగింది. అనంతరం ఎలమంచిలిలో నిర్మాణంలో ఉన్నటువంటి టిడ్కో గృహసముదాయలలో మౌళిక సదుపాయాలు పై మునిసిపల్ ఛైర్మెన్ అడారి కుమారి ,మున్సిపల్ కమిషనర్ తోను మరియు కౌన్సిల్ సభ్యులతో కలిసి వాటర్ సప్లై కల్పన పై వున్నటువంటి సమస్యలను అందరితో కలిసి చర్చించడం జరిగింది తదుపరి జరుగుతున్న పనులను పరిశీలించి పలు సూచనలు చేయడం జరిగింది.

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతి పేద వాడి సొంత ఇంటి కల నిజం కావటానికి అధికారులు సమన్వయముతో కలిసి పనిచేసి అనుకున్న లక్ష్యాలను పూర్తి చేసి ప్రభుత్వంనకు మంచి పేరు వచ్చే విధముగా పనిచేయాలని కోరడమైనది. ఈ కార్యక్రమంలో టిడ్కో సూపరెంటెండింగ్ ఇంజనీర్ నరసింహ మూర్తి, రెడ్ క్రాస్ షెల్టర్ మేనేజర్ శ్రీ.మురళి ,ఏ.ఈ.అనుషా, రవి కుమార్, ,సి.ఎల్.టి.సి. మరియు కాంట్రాక్టింగ్ ఏజెన్సీ సిబ్బంది పాల్గొన్నారు.

# రాజేంద్రపాలెం గిరిజన బాలికల ఆశ్రమ హాస్టల్ సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్నటీడీపీ నాయకులు

కొయ్యూరు (విజయభాను న్యూస్) : తెలుగు నాడు స్టూడెంట్స్ ఫేడరేషన్ (టిఎన్ ఎస్ఎఫ్)అధ్యక్షుడు పొట్టుకూరి సన్యాసిరావు ఆధ్వర్యంలో మంగళవారం కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం పంచాయతీలో గల గిరిజన బాలికల ఆశ్రమ హాస్టల్ను సందర్శించారు. ఈ సందర్భగా విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండల తెలుగు దేశం పార్టీ ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి కొర్రు రామమూర్తి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన సబ్బులు, పేస్టులు, కొబ్బరినూనె, షాంపూలు, చెప్పులు, పెట్టెలు ప్రస్తుత ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. అలాగే లేడీస్ హాస్టల్లో వాచ్ఉమెన్ లేరని, అలాగే హెల్త్ ఏఎన్ఎ లేరని విద్యార్థులు తెలియజేశారన్నారు. అలాగే టిచర్సు కొరత ఉందని, ఇంగ్లీష్ టీచర్, ఫిజిక్స్, సైన్స్ టీచర్ లేరని చెప్పారన్నారు. క్లాష్ రూములో డిజిటల్ కంప్యూటర్ సిస్టమ్స్ పనిచేయడం లేదని, అదనపు తరగతులు ఏర్పాటు చేయాలని, లైబ్రరీ కావాలని విద్యార్థులు చెప్పడం జరిగిందన్నారు. గత ఎన్నికల్లో జగన్ రెడ్డి ప్రతీ గిరిజన హాస్టల్లో సన్న బియ్యం ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. కాస్మొటిక్ ఛార్జీలు మొత్తం తగ్గించి అమ్మఒడి పేరుతో మొసం చేస్తున్నారన్నారు. అలాగే అమ్మఒడి ఒక ఇంట్లో ఒకరికి ఇచ్చి ఒక కుటుంబంలో ఇద్దరు ముగ్గురు పిల్లలకు హాస్టల్లో చదువుకునే పిల్లలకు హాస్టల్లో ఇచ్చే సబ్బులు క్రీములు, నూనెలు, పేస్టులు, చెప్పులు, పెట్టెలు పిల్లలకు మొత్తం ఇవ్వడం మానేసి కేవలం ఒక్కరికి మాత్రమే అమ్మఒడి పేరుతో మోసం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు కొర్రు పుల్లయ్య, మండల తెలుగు యువత ఉపాధ్యక్షులు చేవల ప్రసాద్, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి వజ్రపు రమణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ మత్స్యకార దినోత్సవ వేడుకలు




భీమునిపట్నం(విజయభాను న్యూస్) : ఉత్తరాంధ్ర మత్స్య కారుల అభివృద్ధి సేవా సంఘం ఆధ్వర్యంలో భీమిలి మండలం చేపలుప్పాడ పరిధి చొక్కావాని పాలెం లో అంతర్జాతీయ మత్స్యకార దినోత్సవం వేడుకలు ఘనంగానిర్వహించారు. సంఘం అధ్యక్షుడు చొక్కా భాస్కర్ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జీవీఎంసీ నాలుగో వార్డ్ కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ. తీర ప్రాంత మత్స్యకారులకు అన్ని విధాలుగా తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. మత్స్యకార ఉప కులాల్లో అత్యధిక జనాభాగా ఉన్న వాడబల్జీలకు రాజకీయంగా ఎలాంటి ప్రాధాన్యం లేకపోవడం ఆందోళనకరమన్నారు. భవిష్యత్తులో మత్స్యకారులంతా సంఘటితంగా ఉంటూ తమ హక్కుల్ని సాధించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న జీవీఎంసీ కౌన్సిల్లో మిగిలిన సామాజిక వర్గాలకు 10 నుంచి 20 మంది కార్పొరేటర్ లు ఉండగా మత్స్యకారులకు కేవలం ఇద్దరు కార్పొరేటర్లు ఉండడం అనైక్యతకు నిదర్శనం అన్నారు. మిగిలిన సామాజిక వర్గాలు పార్టీ చూడకుండా తమ వర్గానికి చెందిన వారికి ఓటేసి గెలిపిస్తుండగా మత్స్యకారులు మాత్రం రాజకీయ పార్టీల ప్రలోభాలకు లొంగిపోతూ తమ కులాలను రాజకీయంగా నాశనం చేసుకుంటున్నారన్నారు. ఈ ధోరణి మారకుంటే భవిష్యత్తులో చాలా ఇబ్బందికరమైన పరిస్థితి ఎదుర్కోవాల్సి ఉంటుంది అని హెచ్చరించారు. మత్స్యకార వర్గాల్లోని ప్రతిభావంతులైన యువతను పెద్దలను సత్కరించుకోవలసిన బాధ్యత ఉందన్నారు. చేపలుప్పాడ మాజీ సర్పంచ్ కారి అప్పారావు మాట్లాడుతూ మత్స్యకారులను ఎస్టిలో చేర్చాలన్నారు. ఎస్టీల్లో చేర్చడం సాధ్యం కాకుంటే ప్రత్యేక కేటగిరిగా పరిగణించి ఐదు శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. మత్స్యకార నేతలు వాసుపల్లి నల్లబాబు, మారుపల్లి అమర్నాథ్ మాట్లాడుతూ కాలుష్య కారక పరిశ్రమల స్థాపనతో తీర ప్రాంత మత్స్యకారుల ఉపాధి, ఉనికి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. మత్స్యకారేతరులైన కోటీశ్వరులు స్థాపించిన రొయ్యలు కంపెనీలకు వేలకోట్లు రాయితీలు ఇస్తున్న ప్రభుత్వం సాంప్రదాయ మత్స్యకారుల పట్ల చిన్నచూపు చూస్తున్నదన్నారు. కాలుష్య కారక పరిశ్రమలను తీరంలో స్థాపించకుండా మత్యకారులంతా పోరాటం చేయాలన్నారు.

అనంతరం బీచ్ రోడ్ లోని 14 మత్స్యకార గ్రామాలకు చెందిన సుమారు 3000 మంది పేదలకు దాతల సహకారంతో దుప్పట్లు పంపిణీతో పాటు 5000 మంది కి అన్నదానం చేశారు.

వైశాఖీ ఫౌండేషన్ అందించిన ఖరీదైన 300 దుప్పట్లను కూడా ఆ సంస్థ ప్రతినిధి వైశాఖీ సత్తిరాజు ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు, కార్పొరేటర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంగమారి పేటకు చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యులు, మేకనైజ్డ్ ఫిషింగ్ బోట్లు మాజీ కోశాధికారి వాసుపల్లి ఎల్లయ్య , మేకనైజ్డ్ ఫిషింగ్ బోట్ల అసోసియేషన్ కార్యదర్శి వాసుపల్లి ఎల్లారావు, మాజీ కార్యదర్శి దౌలిపల్లి దాసు, మత్స్యకార నేత పుక్కళ్ళ సత్తిరాజు (వైశాఖీ సత్తిరాజు) మత్స్యకార నేతలు చొక్కా చిన్న పాపయ్య, పుక్కళ్ల సుందర్ రావు, చెన్నా వెంకట రమణ, చొక్కా భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మత్స్యకార దినోత్సవం



యానం, విజయభాను న్యూస్ : స్థానిక కేంద్రపాలిత ప్రాంతం యానం నియోజకవర్గంలో రాజీవ్ బీచ్, ప్రపంచ మత్స్యకార దినోత్సవాలు ఘనంగా జరిగాయి. పుదుచ్చేరి ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి, టీటీడీ బోర్డు మెంబర్ మల్లాడి కృష్ణారావు నేతృత్వంలో ఘనంగా మత్స్యకార దినోత్సవం వివిధ సంస్కృతి కార్యక్రమాలు మధ్య, అనేక మంది మత్స్యకారుల పడవలతో విన్యాసాలు నిర్వహించారు. అనంతరం జై మల్లాడి జై మల్లాడి అంటూ నినాదాలతో మత్స్యకారులు పడవలపై విన్యాసాలు చేస్తూ రాజీవ్ గాంధీ బీచ్ లో సందడి చేశారు. మల్లాడి మంత్రిగా ఉన్న హయామలు మత్స్యకార దినోత్సవం ఎంతో ఘనంగా నిర్వహించే వారిని, గ్రామాల వారీగా కూడా అనేక పోటీలను నిర్వహించి, మత్స్యకార కుటుంబాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపేవారు. మల్లాడి పుదుచ్చేరి వ్యాప్తంగా మొదలుపెట్టిన మత్స్యకార దినోత్సవం ప్రపంచ స్థాయిలో కూడా గొప్ప గుర్తింపు తెచ్చింది. దాని తర్వాత వివిధ రాష్ట్రాలకు చెందిన, నాయకులతోపాటు, మత్స్యకార వేడుకలుఈ కార్యక్రమాలను ఆసక్తిగా జరిగించేవారు. ప్రపంచవ్యాప్తంగా మత్స్యకారుల దినోత్సవం ఘనంగా నిర్వహించే ఏకైక ప్రాంతంగా యానం కూడా పేరు గడించింది.

ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో మత్స్యకార సోదరీ సోదరీమణులు, హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అనంతగిరి ఎంపీపీ శెట్టి నీలవేణి అధ్యక్షతన వాడివేడిగా సర్వసభ్య సమావేశం





అనంతగిరి (విజయభాను న్యూస్) : అనంతగిరిలో మంగళవారం ఎంపీపీ శెట్టినీలవేణి,అధ్యక్షతన మండలం సర్వసభ్య సమావేశం వాడివేడిగా జరిగింది. ఈ సమావేశానికి గైర్ హాజరైన పలు శాఖల అధికారులపై సభ్యులు మండి పడ్డారు. అటవీ శాఖ అధికారులు క్షేత్రస్థాయి సిబ్బంది మాత్రమే హాజరు కావడంపై ఘర్షణ వాతావరణం నెలకొంది.అటవీ శాఖ అడ్డంకులతో పలు రహదారుల నిర్మాణాలు విద్యుత్ కనెక్షన్ల ఏర్పాటు వంటి వాటిలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని అయినప్పటికీ గడిచిన నాలుగు సమావేశాల్లో రేంజ్ స్థాయి అధికారులు సమావేశానికి రాకపోవడం పై ఎంపీపీ శెట్టి నీలవేణి జెడ్పిటిసి దీసరిగంగరాజు తోపాటు పలు వురు సర్పంచులు, ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతగిరి మండలంలో అటవీశాఖ రేంజ్ లో పలు మార్పులు చేసుకునేపద్యంలో వాటిని తెలియజేయవలసిన అవసరం సంబంధిత అధికారులపై ఉంటుందని తదుపరి సమావేశానికి తప్పనిసరిగా రేంజ్ స్థాయి అధికారులు మాత్రమే హాజరుకావాలని స్పష్టం చేశారు.ఈ మేరకు వారు గైర్హాజర్ పై జిల్లా కలెక్టర్కు నివేదిక పంపమని తీర్మానం చేశారు. వైద్య ఆరోగ్య శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ పథకంపై సుదీర్ఘ చర్చ జరిగింది. గ్రామస్థాయిలో వైద్యాధికారులతోపాటు మందులు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో వాటిని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్లు జ్ఞానేశ్వరి డాక్టర్ దివ్య సంతోష్ వెంకటేశులు తెలిపారు.నాడు నేడు పథకంలో అన్ని ప్రాథమిక పాఠశాలలకు నూతనంగా నిధులు మంజూరయ్యాయని త్వరలోనే పనులు ప్రారంభిస్తామని మండల విద్యాశాఖ అధికారి తెలిపారు. వ్యవసాయ శాఖలో వ్యవసాయ పరికరాలను సబ్సిడీలో అందజేసేందుకు అవకాశం ఉందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారిని ఉమామహేశ్వరి కోరారు.సమావేశానికి గేర్హాజరైన ఆర్టీసీ ఎక్సైజ్ శాఖలపై ఉన్నతాధికారులకు చర్యలకు సిఫారసు చేస్తూ నివేదిక పంపుతామని ఎంపీపీ నీలవేణి స్పష్టం చేశారు.మండలంలోని పంచాయతీ కార్యదర్శుల బదిలీలు జరిగిన నేపథ్యంలో ఇబ్బందులు తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులను డిప్టేషన్ పద్ధతిలో డిడిఓ లను తక్షణమే ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు శోభ తిరుపతమ్మ, శ్రావణి మూతిబోయిన సన్యాసిరావు,వైస్ ఎంపీపీదూరు జయవర్ధని, సర్పంచులు పాగి అప్పారావు,జన్నిబిమ్మాలమ్మ సాలేపు పెంటమ్మ ,కురడబోయిన రాములమ్మ ,ఎంపీడీవో శ్రీహర్షిత్ ,తహసిల్దార్ రాంబాయి,ఈవో ఆర్ డి మల్లేశ్వరరావు వివిధ శాఖల అధికారులు కోఆప్షన్ సభ్యుడు షేక్ మదీనా తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా


## గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి





అల్లూరిజిల్లా (విజయభాను న్యూస్) పాడేరు : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలలో ఆర్థిక భరోసా లభించిందని పాడేరు శాసనసభ్యులుకొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. సంక్షేమ పథకాల రూపంలో ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవకాశం ఏర్పడిందని వీటి ద్వారా స్వయం ఉపాధి పొందేందుకు ప్రయత్నించడం సంతోష దాయకమని ఆమె తెలిపారు. చింతపల్లి మండలం గెంజిగడ్డ, వాముగెడ్డ, బయలు కించంగి. ఇంద్రనగర్ కాలనీ, బయలు కించంగి రోడ్ వీధి, మెట్ట వీధి , గున్నలంక, సత్యవరం, చదలవాడ, చీడిపల్లి, గున్న మామిడి వీధి గ్రామాలలో లిగడపగడపకు మన ప్రభుత్వంలి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాడేరు శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై ప్రజల సమస్యలను తెలుసుకునే ప్రయత్నం చేశారు. మొత్తం 480 గడపలను సందర్శించి, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు గురించి లబ్దిదారులను అడిగి తెలుసు కున్నారు. సమస్యలు ఉంటే తెలియజేయాలని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని గడపగడపలోను తెలియజేశారు. ఈ గ్రామాల్లో శాసనసభ్యులు పర్యటిస్తున్న సమయంలో ప్రతి ఇంట సాదన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వలన కొందరు గొర్రెలను, కొందరు మేకలను, పశువులను మరికొందరు ఇంటి వద్ద ఉండే పిండి మిల్లులను కొనుగోలు చేసుకుని వాటి ద్వారా ఉపాధి పొందుతున్నారని తెలిపారు. చాలామంది ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా వచ్చినటువంటి డబ్బులతో ఉపాధి మార్గాలను ఎంచుకోవడం సంతోషదాయకమని భాగ్యలక్ష్మి గారు చెప్పారు. ఈ కార్యక్రమంలో చౌడపల్లి సర్పంచ్ లలిత, సర్పంచుల ఫోరం అధ్యక్షులు మీనా కుమారి, ఎంపీపీ అనూష దేవి, పుష్పలత, గొందిపాకలు , దాసరి పద్మ, చింతాడ జయలక్ష్మి, కో ఆప్షన్ సభ్యులు నాజర్ వల్లి, బీసీ సెల్ ప్రెసిడెంట్ లోవరాజు, ఓసి సెల్ అధ్యక్షులు దాసరి మత్స్యరాజు, రఘునాథ్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అరకు పార్లమెంట్ కార్యదర్శి గుణబాబు మోరి రవి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మీరా, చౌడిపల్లి గంగన్న దొర, సైతాన్, సింహాచలం, గంగన్న పడాల్, కరుణానిధి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన లో భాగంగా ప్రతీ పంచాయితీ లో దివీస్ వారి సహకారంతో శ్మశాన వాటిక



భీమునిపట్నం (విజయ భాను న్యూస్) : భీమిలీ మండలం మూలకుద్దు పంచాయితీ పాత మూలకుద్దు గ్రామంలో దివీస్ యాజమాన్యం వారు 16.00 లక్షల తో శ్మశాన వాటిక నిర్మాణ పనులను మండల పరిషత్ అధ్యక్షులు దంతులూరి వాసు రాజు చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన లో భాగంగా ప్రతీ పంచాయితీ లో ఒక శ్మశాన వాటికని దివీస్ ఏర్పాటు చేస్తున్నారని అలాగే కంపెనీ సమీపంలోని పంచాయితీ లలో మెరుగైన వసతులు, ప్రజల జీవన ప్రమాణాలు పెంచే కార్యక్రమాలు రూపొందించాలి అని వాసు రాజు విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు కొల్లి కోటి, అసి రమణ, మాజీ వార్డు సభ్యులు రమేష్ , దివీస్ సామాజిక బాధ్యత అధికారి శ్రీనాగరాజు, సిబ్బంది నరసింహారావు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా

# ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలి




విశాఖపట్నం (విజయభాను న్యూస్) : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్ర పరచుకోవాలని జీవీఎంసీ 32 వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు పిలుపునిచ్చారు సోమవారం వార్డు పరిధిలో చలువతోట, నంది బొమ్మ ప్రాంతం,ఏడు గుళ్ళు, దేవాంగుల వీధి, అల్లిపురం మెయిన్ రోడ్, అల్లిపురం మార్కెట్ తదితర ప్రాంతాల్లో జోనల్ కమిషనర్ చక్రవర్తి, జీవీఎంసీ సిబ్బంది, మలేరియా సిబ్బంది, సచివాలయ సిబ్బందితో కలిసి పర్యటించి వార్డు ప్రజలకు ఆరోగ్య పరిరక్షణ,పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కందుల నాగరాజు మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షన్ లో భాగంగా విశాఖ దేశవ్యాప్తంగా మొదటి స్థానంలో నిలిచేలా విశాఖ ప్రజలందరూ సహకరించాలని కోరారు. తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి పారిశుద్ధ్య సిబ్బందికి అప్పగించాలని,ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిలువ లేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్ కవర్లు బహిష్కరించి పర్యావరణాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ మలేరియా సచివాలయ సిబ్బంది కిషోర్, ఎం కాశీ,ఎస్ వరప్రసాద్,ఏ వెంకటేశ్వరరావు, డివిఆర్ మూర్తి, కీర్తి, ఎస్ కృష్ణ, ప్రసాద్విశి బాల, చిరంజీవి వార్డు సచివాలయం వాలంటీర్లు పాల్గొన్నారు.

## చోడపల్లిలో కొనసాగుతున్న

# మాలధారణ స్వాములకు అన్నసమారాధన



అచ్యుతాపురం (విజయభాను న్యూస్) : భక్తులు ఇచ్చిన విరాళాలతో మాలధారణ స్వాములకు , భవానీలకు చోడపల్లిలో గత 15 రోజుల నుండి శ్రీ చోడమాంబిక ఆలయం ఆవరణంలో అన్నసమారాధన (భిక్ష) కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. గ్రామానికి చెందిన కాకి నూకరాజు ఆధ్వర్యంలో ఈ నెల 7 న తొలిసారిగా ప్రారంభించిన ఈ అన్నదాన కార్యక్రమం రోజు కొనసాగుతుంది. దీంతో కొంతమంది భక్తులు రోజుకు ఒకరు చొప్పున విరాళాలు ఇచ్చి అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. అయ్యప్పలకు రుచికరమైన వంటకాలు చేసి వడ్డిస్తు న్నారు.

మొదటి రెండు రోజులు వరకు 50 మందితో ప్రారంభమైన అన్నదాన కార్యక్రమం నేటికీ 200 మంది పైగా స్వాములు వచ్చి అన్నదాన ప్రసాదాన్ని స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమం భక్తులు సహకారంతో ఇంకా కొనసాగు తుందని నవంబర్ 7 న ప్రారం భించిన ఈ కార్య క్రమం ఈనెల 28 వరకు కొనసాగిస్తున్నట్టు నూకరాజు స్వామి తెలిపారు.

## వార్డులో సామాజిక సమస్యలను పరిష్కరించాలని

## వినతి పత్రం సమర్పణ




భీమునిపట్నం(విజయ భాను న్యూస్) : జీ వి ఎం సీ భీమిలి జోన్ 3వ వార్డులో పలు సామాజిక సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించేవిధంగా తగిన చర్యలు తీసుకోవాలని భీమిలి జోనల్ కమీషనర్ ఎస్. వెంకటరమణను భీమిలి జోన్ 3వ వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ కోరారు. టి డి పి రాష్ట్ర కార్యదర్శి, గంటా నూకరాజు, పలువురు టిడిపి నాయకులతో కలసి ఆమే కమీషనర్ కు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. భీమిలి పర్యాటక ప్రాంతం కావడంవలన తరచూ పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉందని అన్నారు. అదేవిధంగా పలు సందర్భాల్లో సముద్రం స్నానం చేయుటకు వెళ్లిన పర్యాటకులు ప్రాణాలు కోల్పోవడం జరుగుతుందని, అందువలన తక్షణమే తీరంలో లైఫ్ గార్డులను ఏర్పాటు చేయాలని కోరారు. శ్రీ నూకాలమ్మ గుడి స్టేజ్, శ్రీ పోలమాంబ ఆలయం, శివాలయం ప్రాంతం, గంటస్తంభం, పుట్ బాల్ గ్రౌండ్ తదితర ప్రాంతాలలో ఐ మాక్ష్ లైట్లు ఏర్పాటు చేయాలని అన్నారు. రెల్లివీధి, గొల్లవీధి, లక్ష్మీ నరసింహ స్వామి గుడి ప్రాంతాల్లో సామాజిక భవనాలు చాలావరకు పాడై ఉన్నాయని వాటిని మారమ్మతులు చేయించి ప్రజల అవసరానుసారం అందుబాటులోకి తేవాలని కోరారు. . భీమిలి బీచ్ లో ఉన్న ఓపెన్ జిమ్ పరికరాలు కొంత వరకు పాడై ఉన్నాయి. చిన్నపిల్లలు దగ్గర నుండి పెద్దవాళ్ళు, మహిళలు కూడా తరచూ వస్తూ ఉంటారు. అందువలన ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందుగా సాంకేతిక నిపుణు లతో వాటిని యధాతదంగా వినియోగంలోకి వచ్చే విధంగా చేయాలని కార్పొరేటర్ గంటా అప్పలకొండ కోరారు.

ఈ కార్యక్రమంలో పెంటపల్లి యోగీశ్వర రావు, మారోజు సంజీవకుమార్, కనకల అప్పలనాయుడు, కొక్కిరి అప్పన్న, సీనియర్ నాయకులు గండిబోయిన పోలి రాజు, వియ్యపు పోతురాజు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

### కుండలేశ్వరంలో సామూహిక లక్షపత్రీ పూజ



కాట్రేనికోన : మండలం కుండలేశ్వరంలోని శ్రీ పార్వతీ సమేత కుండలేశ్వరంస్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా మంగళవారం సామూహిక లక్ష పత్రి పూజ కార్యక్రమం నిర్వహించారు. బ్రహ్మశ్రీ కాళ్ళకూరి దుర్గా ప్రసాద్ అధ్వర్యంలో అర్చక స్వామి కాళ్ళకూరి కామేశ్వర రావు పూజలు జరిపించారు.



అనంతగిరి (విజయభాను న్యూస్) : ఏకో టూరిజంకు ఐదు కోట్ల 50 లక్షలు ప్రణాళిక, అనంతగిరి సెక్షన్ మర్దగూడ సమీపంలో గల ఫారెస్ట్ పరిధిలో ఏకో టూరిజం నకు స్థల పరిశీలనకు సీఎఫ్ రాష్ట్ర అటవీశాఖ అధికారి మధుసూదనరావు పరిశీలించారు.సిసిఎఫ్ రామ్మోహనరావు విశాఖపట్నం డిఎఫ్ఓ ఆనంతశంకర్ పాడేరు డిఎఫ్ఓ వినోదకుమార్ అనంతగిరి రేంజర్ దుర్గా ప్రసాద్ సిబ్బంది సీతారాం పాల్గొన్నారు.

## మెర్సీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివాసీ పరిరక్షణ సమితి ద్వారా

# గిరిజనులకు స్వెట్టర్ల పంపిణీ



అనంతగిరి (విజయభాను న్యూస్) : అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం గాలికొండ కాఫీ ప్లాంటేషన్ ప్రాంతంలో కాఫీ నిర్వాసితులకు మెర్సీ ఫౌండేషన్ ఫౌండర్ & డైరెక్టర్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివాసీ పరిరక్షణ సమితి చైర్మన్ చట్టు మోహన్ చేతుల మీదుగా సుమారు 50 మంది గిరిజనులకు స్వెట్టర్ల పంపిణీ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఆదివాసీ పరిరక్షణ సమితి చైర్మన్ చట్టు మోహన్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో నానాటికి పెరుగుతున్న చలి వలన గిరిజనులు రోజువారీ పనులు చేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్న సందర్భంలో గిరిజనుల బాధలు గుర్తించి ఉచితంగా స్వెట్టర్లు పంపిణీ చేయడానికి ముందుకొచ్చిన మెర్సీ ఫౌండేషన్ వారికి ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమనికి మెర్సీ ఫౌండేషన్ ఫౌండర్ & డైరెక్టర్ భాగ్యలక్ష్మి మరియు ఫౌండేషన్ సభ్యులు ముఖ్య అతిథులుగా ఆదివాసీ పరిరక్షణ సమితి చైర్మన్ చట్టు మోహన్, అనంతగిరి మండల జడ్పీటీసీ దీసరి గంగరాజు, అనంతగిరి, పంచాయతీ సర్పంచ్ సింహాద్రి, అనంతగిరి పంచాయతీ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## త్రాగునీటి కష్టాలు తీర్చిన

# ఎమ్మెల్యే ఆధీప్‌రాజ్ కు ధన్యవాదాలు

### ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు





పరవాడ (విజయభాను న్యూస్) : ముత్యాలమ్మపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో గల సమ్మంగి పాలెం, జాలారిపేట గ్రామాలలో గత పంచాయతీ పాలక వర్గం చేతకానితనం వలన త్రీవ త్రాగునీటి ఇబ్బందులు ఉన్నందున నాయడుపాలెం గ్రామ సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య సహకరంతో ముత్యాలమ్మపాలెం గ్రామ సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు వారు ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుంటూ నిరంతరం కృషి చేసి నేడు బోరు వేయించగా పుష్కలంగా మంచి నీరు పడింది. ఈసందర్భంగా నిధులు మంజూరు చేయించి నందు గాను మా రెండు గ్రామాలు తరుపునపెందుర్తి శాసనసభ్యులు అన్న రెడ్డి ఆదీప్ రాజ్ మరియుపరవాడ మండల పరిషత్ అధ్యక్షులు పైలా పద్మలక్ష్మి శ్రీనివాస్ రావు పరవాడ జడ్పిటిసి రాజు మరియు ఇతర ప్రజా ప్రతినిధులు మరియు అధికారులకు ముత్యాలమ్మ పాలెం సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియపరిచారు.

## త్రాగునీటి కష్టాలు తీర్చిన ఎమ్మెల్యే ఆధీప్ రాజ్‌కు ధన్యవాదాలు

## తెలిపిన సర్పంచ్ కూండ్రపు

### పనులను పరిశీలించిన అర్ డబ్ల్యూయస్ ఎఇ షణ్ముఖ



పరవాడ (విజయభాను న్యూస్) : పరవాడ మండలము నాయుడుపాలెం గ్రామ పంచా యతీ పరిధిలో గలకోరంగిపాలెం, చాకలిపేట, మంగప్పయ్యగారివూరి గ్రామాలలో త్రాగునీటి ఇబ్బందులు ఉన్నందుననాయడుపాలెం గ్రామ సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతా రామయ్య ప్రభుత్వ అధికారులతో సమ న్వయం చేసు కుంటూ నిరంతరం కృషి చేసి నేడు బోరు వేయించగా పుష్కలంగా మంచినీరు పడిన సందర్భంగా నిధులు మంజూరు చేయించినందు గాను మా గ్రామాలు తరుపునపెందుర్తి శాసన సభ్యులు అన్న రెడ్డి ఆదీప్ రాజ్ ,పరవాడ మండల పరిషత్ అధ్యక్షులు , పైలా పద్మలక్ష్మి శ్రీనివాస్ రావు పరవాడ జడ్పిటిసి సభ్యులు పియస్ , రాజు మరియు ఇతర ప్రజా ప్రతినిధిలు అధికారులకు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేసారు. ఈ బోర్ వేల్స్ పనులును మంగళవారం అర్ డబ్ల్యూయస్ ఎఇ షణ్ముఖ పరిశీలించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటీసి కూండ్రపు శ్రీరామ మూర్తి , అప్పలరాజు , నూకరాజు , అప్పారావు, సోమునాయుడు పెద్దలు పాల్గొన్నారు

## ఉప ముఖ్యమంత్రి దృష్టికి అనంతగిరి జూనియర్ కళాశాల సమస్యలను తీసుకుని వెళ్లిన ఎంపీపీ శెట్టి నీలవేణి

### సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చిన ఉప ముఖ్యమంత్రి రాజన్న దొర



మంత్రికి శాలువాతో సత్కరిస్తున్న ఎంపీపీ నీలవేణి, గుమ్మకోట సర్పంచ్ పాగి అప్పారావు

అనంతగిరి (విజయభాను న్యూస్) : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి గిరిజన సంక్షేమ శాఖ మాత్యులు గౌరవ శ్రీ లిపీడిక రాజన్న దొరలి గారి దృష్టికి అనంతగిరి ఎంపీపీ శెట్టి నీలవేణి విద్యార్థుల తరఫున తీసుకుని వెళ్లారు. అరకులోయ పర్యటనకు వచ్చిన ఆయన్ను మంగళవారం సాయంత్రం అనంతగిరి మండల కేంద్రంలో కళాశాల విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆమె గౌరవ మంత్రి గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాలలో ఇటీవల బాలిక మృతి చెందిన విషయాన్ని ఆయన దృష్టికి తీసుకొని వెళ్లారు. వసతి గృహ సమస్య వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బాలికలకు వసతి గృహం మంజూరు చేయాలని అదే విధంగా బాలుర వసతి గృహ భవన నిర్మాణాన్ని పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. అదేవిధంగా కళాశాలకు. ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలని లిఖితపూర్వకంగా ఉప ముఖ్యమంత్రి గారిని కోరారు. నాడునేడులో అదనపు భవన నిర్మాణం సాంకేతిక కారణాలతో నిలిచిపోయిందని మంత్రి దృష్టికి ఆమె తీసుకుని వెళ్లారు. ఆ సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆయన ఆదేశించారు. జూనియర్ కళాశాల వసతి గృహాలకు తాగునీటి సదుపాయాన్ని కల్పించాలని జెడ్పిటిసి సభ్యులు గంగరాజు కోరారు. ఈ మేరకు వసతి గృహాన్ని మంజూరు చేస్తానని తాగునీటి సదుపాయాన్ని తక్షణమే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ ఈఎన్ సి శ్రీనివాస్ కు ఆయన ఆదేశించారు. జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని పునరుద్ధరించాలని విద్యార్థులు మంత్రిని కోరారు. విద్యార్థులతో నేరుగా ఆయన మాట్లాడి పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా అనంతగిరి మండలంలోని గుమ్మకోట పంచాయతీ శంకుపర్తి రహదారిని పనులు ప్రారంభించాలని బీం పోలు పంచాయతీ సరియాపల్లి రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆయా సర్పంచ్ లు లిబిమ్మాలమ్మలి మండలం ఫోరం అధ్యక్షుడు పాగి అప్పారావు,. ఈ కార్యక్రమంలో అరకులోయ శాసనసభ్యులు శెట్టి పాల్గుణ స్వచ్ఛ కార్పొరేషన్ డైరెక్టర్ లిశోభాసోమేశ్వరి వైసీపీ నాయకులు లిఈశ్వరరావులి కోఆప్షన్ సభ్యుడు షేక్ మదీనా టోకూరు సర్పంచ్ మోసియా తదితరులు పాల్గొన్నారు.

### ట్రామోంటనా కుకింగ్ స్టవ్ లు ప్రయోజనాలపై అవగాహన

అల్లూరిజిల్లా. విజయభాను.పాడేరు:ట్రామోంటనా కంపెనీ తయారు చేసిన పొగరాని పోయిలు ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతుందని గృహిణులను ప్రయోజనకరమైన పొయ్యి అని క్రాప్ జోన్ సంస్థ ఎం డి సాయి బాబా తెలిపారు. క్రాప్ జోన్ ఎండి సాయిబాబా ఆధ్వర్యంలో ఏజెన్సీ మండలాల లోని అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. గ్రామంలో పొగరాని పోయిల ఆవశ్యకత పై మహిళకు అవగాహన కార్యక్రమం నిర్వహించి త్వరలో పొయ్యిలను పంపిణీ చేయనున్నారు

## విప్రో కన్స్యూమర్ కేర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంతూర్ స్కాలర్‌షిప్ 2022-23 యొక్క 7వ ఎడిషన్

విశాఖపట్నం : విప్రో కేర్స్‌తో కలిసి విప్రో కన్స్యూమర్ కేర్ తమ ఏడవ ఎడిషన్ సంతూర్ ఉమెన్స్ స్కాలర్‌షిప్ కార్యక్రమాన్ని కర్నాటక, ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణా రాష్ట్రాలలో ప్రారంభించింది. మొట్టమొదటిసారిగా ఈ స్కాలర్‌షిప్ ను ఛత్తీస్‌ఘడ్‌లో సైతం ప్రారంభించనున్నారు. ఉన్నత విద్యనభ్యసించాలనే కోరిక ఉన్నప్పటికీ ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన ప్రతిభావంతులైన బాలికలకు తగిన మద్దతునందించడంలో భాగంగా ఈ స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా మరియు కర్నాటక రాష్ట్రాలలో 10వ తరగతి నుంచి 12 వ తరగతి వరకూ ప్రభుత్వపాఠశాలలు/కాలేజీలలోవిద్యనభ్యసించిన విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్‌లను అందుకోవడానికి అర్హులు. వీరు గుర్తించబడిన సంస్థ అందించే కోర్సులలో కనీసం మూడు సంవత్సరాల వ్యవధి కలిగిన డిగ్రీ కార్యక్రమంలో చేరి ఉండాలి. ఈ కార్యక్రమం గురించి విప్రో కన్స్యూమర్ కేర్ అండ్ లైటింగ్, వైస్ ప్రెసిడెంట్ -మార్కెటింగ్, ఎస్.ప్రసన్న రాజ్ మాట్లాడుతూ "ఈ సంవత్సరం మేము నాలుగు రాష్ట్రాల్లోనూ కలిపి 1800 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందించనున్నాము. మేము ఈసారి తెలంగాణా, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలలో ఉన్న ఒక్కో రాష్ట్రానికి 300 స్కాలర్‌షిప్‌ల సంఖ్యను ఇప్పుడు రాష్ట్రానికి 500 స్కాలర్‌షిప్‌ల చొప్పున పెంచాము. మొట్టమొదటిసారిగా ఛత్తీస్‌ఘడ్‌లో ఈ సారి 300 స్కాలర్‌షిప్‌లను అందించబోతున్నాము. గత ఆరు సంవత్సరాలలో అర్హతకలిగిన 4500 మంది బాలికలకు తమ గ్రాడ్యుయేషన్ పూర్తి చేయడంలో సహాయపడ్డాము" అని అన్నారు.

# కపాలభాతితో కాంతివంతమైన ఆరోగ్యం

**కపాలభాతి ప్రాణాయామం ఆడవారికి అనేక సమస్యల నుండి బయట పడటానికి చాలా సహాయపడుతుంది. ఒక నిర్దిష్ట సమయంలో అనేక భంగిమలను సాధన చేయవచ్చు. కపాలభాతి అనే పదం సంస్కృతం నుండి వచ్చింది. కపాల అంటే మస్తిష్కం అని,భాతి అంటే కాంతి లేదా మెరుపు అని అర్థం. ఈ భంగిమను అనుసరించటం ద్వారా చర్మంలో మెరుపు మరియు తాజాదనాన్ని గమనించవచ్చు.ఈ మార్పు అనేది ఒక్క రాత్రిలో రాదు. దీనిని సాధించటానికి చాలా కష్టపడాలి. యోగా వ్యాయామాలు శ్వాస నియంత్రణ మరియు సంతులనం నిర్వహణలో సహాయపడి శరీర అభివృద్ధిలో ముఖ్యమె%న పాత్రను పోషిస్తాయి. ప్రాణాయామం శ్వాసతో సంబంధం కలిగి ఆరోగ్యకరమైన శరీరం, మనస్సు, ఆత్మలను అందిస్తుంది. ఈ శక్తివంతమైన భంగిమ ప్రాథమికంగా చైతన్యాన్ని నింపటంలో సహాయపడి, వ్యవస్థకు ఒక టానిక్ వలే పనిచేస్తుంది. అందువల్ల ఈ ప్రాణాయామం వల్ల కపాలం శ్వాసలో మెరుస్తూ మంచి శ్వాస తీసుకుంటుంది. నిర్దిష్ట సమయంలో కపాలభాతి వ్యాయామాన్ని సాధన చేయటం ద్వారా కాపాలానికి మంచి శ్వాసను అందించవచ్చు.**



కపాలభాతి టెక్నిక్ నిర్వహించటానికి దశలు:

1. ఈ భంగిమను ప్రారంభించటానికి మీరు ఒక సౌకర్యవంతమైన స్థానంలో కూర్చోవాలి. అలాగే వెన్నెముకను నిటారుగా ఉంచి,ఉదరాన్ని సాధ్యమైనంత వరకు సౌకర్యవంతంగా ఉంచాలి.
2. మోకాళ్ళపై చేతులను ఉంచాలి. మోకాళ్ళ మీద అరచేతులను ఉంచాలి.
3. పొట్ట కింద బాగంలో దృష్టి పెట్టాలి. మంచి పరిపూర్ణత సాధించడానికి అరచేతులను మోకాళ్ళ మీద నుంచి పొట్ట కింద బాగంలో పెట్టి, ధ్యానం చేయాలి.
4. ఇప్పుడు ముక్కు రెండు రంధ్రాల ద్వారా లోతె%న శ్వాసను తీసుకోవాలి.
5. ఇప్పుడు అరచేతులతో పొట్టను శాంతంగా నొక్కి శ్వాసను నియంత్రించాలి.
6. గాలిని పీల్చటం ఆటోమేటిక్‌గా జరిగిపోతుంది. అందువల్ల గాలిని వదిలే క్రమం మీద దృష్టిని కేంద్రీకరించాలి.
7. మొదట 60 నుంచి 70 శ్వాసలతో ప్రారంభించాలి. ఆ తర్వాత 95 నుంచి 105 వరకు నిదానంగా పెంచుకుతూ వెళ్ళాలి. ఊపిరి అడ నట్టు అన్పిస్తే, ఆపి సాధారణ శ్వాస తీసుకోని మరల ప్రారంభించ వచ్చు.
8. ఈ ఆసనం వేసేటప్పుడు నోరు,ముక్కు రెండు అవయవాలు పనిచే స్తాయి. ముక్కు గాలి పీల్చుకోవటానికి మరియు నోరు గాలిని వదల టానికి సహాయపడుతుంది. ప్రతి రోజు 15 నుంచి 20 నిమిషాల పాటు చేస్తే మంచి పలితం కనపడుతుంది.

ఈ ఆసనం వలన కలిగే ఇతర ప్రయోజనాలు: సైనస్ ,ఊపిరితిత్తులు మరియు శ్వాస వ్యవస్థను శుభ్రం చేయడానికి సహాయపడుతుంది. అలెర్జీలకు వ్యతిరేకంగా పోరాడటానికి అవసరమె%న శక్తిని ఇస్తుంది. ఉదర కండరాలు మరియు డయాఫ్రాగమ్ కు శక్తినిస్తుంది.

ఏకాగ్రతను మెరుగుపరుస్తుంది. పునరుత్పత్తి వ్యవస్థ పనితీరును క్రమపరుస్తుంది. జాగ్రత్తలు గుండె సమస్యలు,ఉబ్బసం, అధిక రక్తపోటు, హెర్నియా ఉన్నవారు మరియు గర్భిణీ స్త్రీలు ఈ ఆసనానికి దూరంగా ఉండటం మంచిది. ఈ భం గిమ ఆరోగ్యకరమైన జన నేంద్రియ వ్యవస్థకు అద్భు తంగా పనిచేస్తుంది. పున రుత్పత్తి కోసం శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. ఈ భంగిమలను పుస్తకాల్లో చదివి లేదా ఫొటోలను చూసి చేయకూడదు. గురువు దగ్గర నేర్చుకొని మాత్రమే చేయాలి.

# ఆహారంతో ఆరోగ్యం



ఆహారంలో ప్రొటీన్లు తక్కువగా ఉంటే ఆకలి ఎక్కువగా అవుతుంది. 20 శాతం ప్రొటీన్లు ఉన్న భోజనం చేసే వారితో పోలిస్తే 15 శాతం ప్రొటీన్లు ఉన్న భోజనం తీసుకునే వారు ఒక రోజులో 260 క్యాలరీలు ఎక్కువగా తీసుకుంటారు. 70 శాతం అదనపు క్యాలరీలు మనం రోజూ తినే చిరు తిండ్లతోనే సమకూరుతుంది. సంవత్సరం గడిచే సరికి సుమారు ఐదు నుంచి ఎనిమిది కిలోల బరువు కూడా పెరుగుతాము. దీన్ని నివారించాలంటే మాంసం, చేపలు, కోడిగుడ్ల వంటి ఆహారాన్ని సాధారణంగా తీసుకునే దాని కన్నా ఎక్కువగా తీసుకోవాలి. మనం తీసుకునే ఆహారంలో ప్రొటీన్ల నిష్పత్తి తగ్గితే ఆకలి పెరుగుతుంది. తద్వారా ఇంకా తింటాం. దీంతో శరీరంలో కెలరీలు విపరీతంగా పెరిగిపోయాయి. ఆహారాన్ని స్వీకరించడంలో సమతుల్యత, వైవిధ్యం, మితంగా వ్యవహరించడం అనేవి ఆరోగ్యకరమైన అలవాటు. అలా అని ఒకేసారి తినేదాని కంటే అధికంగా పట్టించినా ఇబ్బందే. ఒక్కసారే ఎక్కువ మొత్తంలో తినేకంటే రోజులో ఎక్కువసార్లు కొద్దికొద్దిగా తినడమే ఆరోగ్యకరమని వైద్యులు చెబుతున్నారు. ఎక్కువ క్యాలరీలు పొందకుండా, ఒకే దానిని అతిగా స్వీకరించకుండా అనేక రకాలు ఆహార పదార్థాలను కొంచెంగా తీసుకోవడం మంచిది. పోషక పదార్థాలు అధికంగా ఉండే వివిధ రకాల ఆహార పదార్థాలను తీసుకోండి. ఈ లెక్కన మంచి ఆరోగ్యం కోసం వైవిధ్యమైన 30 నుంచి 35 రకాల పోషక పదార్థాలను తీసుకోవాల్సి ఉంటుంది. ఏ ఒక్క ఆహారం కూడా అన్నింటినీ అందించదు. మీ దినసరి ఆహార ఎంపికలో పప్పు ధాన్యాలతో చేసిన పదార్థాలు, పండ్లు, కూరగాయలు, పాల పదార్థాలు, మాంసం, చేపలు ఉండేలా చూసుకోవాలి. దీని కోసం టైం టేబుల్‌ను తయారు చేసుకుని దాన్ని పాటించాలి. రోజు ఎన్ని కెలరీలను ఖర్చు చేయగలమో అంత మోతాదులోనే ఆహారం తీసుకోవాలి. ధాన్యాలు, పండ్లు, పప్పులు, కూరగాయలను అధికంగా తీసుకోండి. పచ్చి కూరగాయలు తీసుకుంటే పోషకాలు నేరుగా అందుతాయి. అన్నంలో, చపాతీల్లో కూర ఎక్కువ తినాలి. రోజు ఎంత తినాలి? అనే విషయంలో మన చేసే పని, ఎత్తు, ప్రస్తుత బరువు, వయస్సు, స్త్రీ, పురుషుడు ఇలా పలు లక్షణాలను అంచనా వేయాల్సి ఉంటుంది. అధిక బరువు శరీరానికి చేటు చేస్తుంది. ఎత్తుకు సరిపోయేలా బరువు వుంటే చాలు. ఈ విషయంలో వైద్యుడిని సంప్రదించి సలహా తీసుకోండి. మితాహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చు.

# పిల్లలపై న్యుమోనియా నీడలు



పిల్లలపై న్యుమోనియా నీడలు కమ్ముకుంటున్నాయి. కరోనాకు చలి ప్రభావం తోడవ్వడంతో ఈ వ్యాధి చిన్నారులను గడగడలాడిస్తున్నది. ముఖ్యంగా ఈసారి చలితీవ్రత అధికంగా ఉండటంతో పిల్లల్లో ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు పెరుగుతున్నట్లు నిలోఫర్ చిన్నపిల్లల విభాగాధిపతి ప్రొఫెసర్ ఉషారాణి తెలిపారు. చలి పులి పంజా విసురుతున్నది. చిన్న పిల్లలను న్యుమోనియా వెంటాడుతున్నది. కరోనాకు చలి ప్రభావం తోడవ్వడంతో న్యుమోనియా కోరలు సాచుతున్నది. ఇప్పటికే నగరంలో 30శాతం మంది చిన్నారులను ఈ వ్యాధి వెంటాడుతున్నది. ప్రతిరోజు నిలోఫర్ దవాఖానకు దాదాపు 80మంది చిన్నారులు న్యుమోనియాతో బాధపడుతూ చికిత్స నిమిత్తం వస్తున్నారు. కేవలం నిలోఫర్ లోనే ఇలా ఉంటే నగర వ్యాప్తంగా ఉన్న దవాఖానల్లో కేసులు పెద్ద సంఖ్యలో నమోదవుతున్నాయి. అయితే తల్లిదండ్రులు వ్యాధి తీవ్రత ముదరక ముందే వైద్యులను సంప్రదించాలని, నిర్లక్ష్యం చేస్తే పిల్లల ప్రాణాలకే ప్రమాదమని హెచ్చరిస్తున్నారు. తల్లిపాలతో న్యుమోనియాను అడ్డుకోవచ్చని సూచిస్తునా

పిల్లలకు సంబంధించిన వ్యాధుల్లో అత్యంత ప్రమాదకరమైనది న్యుమోనియానే అని, దీనివల్లనే 5 ఏండ్లలోపు పిల్లల్లో మరణాల రేటు అధికంగా ఉంటుందన్నారు. ఈ వ్యాధి వల్ల ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏడాది 2.5 మిలియన్ల మంది పిల్లలు మృత్యువాత పడుతున్నారని డబ్ల్యూహెచ్ఓ గణాంకాల ద్వారా తెలుస్తున్నది. గ్రేటర్‌లో 30శాతం మంది పిల్లలు ఈ న్యుమోనియా వ్యాధితో బాధపడుతున్నట్లు ఐఏపీ(ఇండియన్ అకాడమి ఆఫ్ పీడియాట్రిక్)వర్గాలు చెబుతున్నాయి. నగరంలోని నిలోఫర్ దవాఖానకు ప్రతిరోజు ఓపీ కోసం సుమారు 500మంది రోగులు వస్తే వారిలో 50నుంచి 80కేసులు న్యుమోనియాకు సంబంధించి ఉంటున్నట్లు నిలోఫర్ ఓపీడీ ఇన్‌చార్జి, ఆర్ఎంఓ డాక్టర్ రమేశ్ దాంపురి తెలిపారు. వీరిలో రోజుకు సుమారు 10నుంచి 12మందిని ఇన్‌పేషెంట్లుగా చేర్చుకుని చికిత్స అందిస్తుండగా, మిగిలిన వారికి ఓపీలో చికిత్స అందించడం జరుగుతుందన్నారు.

ఇది కేవలం నిలోఫర్ దవాఖానకు సంబంధించిన లెక్కలు మాత్రమేనని తెలిపారు. ఇక చిన్నపిల్లలకు సంబంధించిన క్లీనిక్‌లు, దవాఖానల్లో ఈ కేసులు అధికంగా ఉన్నట్లు తెలుస్తున్నది. అమెరికా వంటి దేశాల్లో ఇన్‌ఫ్లుయంజా, రెస్పిరేటరీ సిన్సిటియల్ వైరస్ (ఆర్‌సీవీ)వంటి వైరస్‌లతో న్యుమోనియా సంక్రమిస్తే మన దేశంలో ట్యూబర్‌కిలోసిస్ అనే బ్యాక్టీరియా ద్వారా ఎక్కువ సంక్రమిస్తుందని వైద్యులు తెలిపారు. పిల్లల్లో న్యుమోనియా వ్యాధిని సకాలంలో గుర్తించకపోవడంతో వ్యాధి తీవ్రత పెరిగి ప్రమాదస్థాయికి చేరుకుంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వ్యాధిపై ప్రజల్లో అవగాహణ లేకపోవడంతో రోగుల సంఖ్య, మరణాల సంఖ్య అధికంగా ఉంటుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని 2009 నుంచి ప్రతి ఏటా నవంబర్ 12న ప్రపంచ న్యుమోనియా దినంగా పరిగణిస్తున్నారు.

**ఎలా సోకుతుంది?**

బ్యాక్టీరియా, ఫంగస్, వైరస్‌లతో పాటు ఇన్‌ఫ్లూయెంజా, రెస్పిరేటరీ సిన్సిటియల్ వైరస్ (ఆర్‌సీవీ)ల వల్ల న్యుమోనియా వ్యాధి సోకుతుంది. స్ట్రెప్టోకోకస్ బ్యాక్టీరియాతో కూడా ఈ వ్యాధి సంక్రమిస్తుంది. న్యుమోనియాలో రెండు రకాలు ఉన్నాయి.

1. బ్యాక్టీరియాతో వచ్చే న్యుమోనియా 2. వైరల్ ఇన్ఫెక్షన్స్. అంటే సమాజంలో కలిగే మార్పుల వల్ల వచ్చే న్యుమోనియా. దీన్ని కమ్యూనిటీ అక్వైర్డ్ న్యుమోనియా అంటారు. వాతావరణంలో కలిగే మార్పులు, ఇన్ఫెక్షన్‌ల వల్ల వస్తుంది. దవాఖానల్లోని ఇన్ఫెక్షన్‌ల వల్ల వచ్చే న్యుమోనియాను హెల్త్‌కేర్ అసోసియేటెడ్ న్యుమోనియా అంటారు. ఇది దవాఖానల్లో చేరినప్పుడు అక్కడి ఇన్ఫెక్షన్‌లు లేదా ఇన్‌ఫ్లుయంజాతో బాధపడే వారి నుంచి సోకుతుంది. ముఖ్యంగా 5సంవత్సరాల లోపు పిల్లలకు, హెచ్ఐవీతో బాధపడే పిల్లలకు ఈ వ్యాధి సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని నిలోఫర్ వైద్యులు తెలిపారు.

**వ్యాధి లక్షణాలు** నిమిషానికి 30సార్లకంటే ఎక్కువసార్లు శ్వాస తీసుకోవడం

- పొత్తికడుపు, ఛాతిలో నొప్పి
- నోటి చుట్టూ చర్మం
- నీలిరంగుకు మారడం
- పక్కలు ఎగేయడం%అ% ఆయాసం
- తీవ్రమైన జ్వరం
- ఊపిరి పీల్చుకోవడంలో అస్వస్థత
- దగ్గు

న్యుమోనియాను అడ్డుకునే వ్యాక్సిన్‌లు ఇవే

- బీసీజీ
- పెంటావ్యాక్
- హిబ్
- న్యుమోకోకల్
- మిజిల్స్
- ఫ్లూ షాట్

65 ఏండ్లు దాటిన వారికి ప్రమాదమే..

ప్రపంచంలో శిశువులు, వృద్ధుల మరణాలకు పెద్ద ఎత్తున కారణమవుతున్న అతి పెద్ద సంక్రమిత వ్యాధుల్లో న్యుమోనియా ఒకటి. ఊపిరితిత్తుల్లో నీరు చేరి బాధితులకు ఊపిరందని పరిస్థితి తలెత్తుతుంది. 65ఏండ్ల వయస్సు దాటిన వారికి రోగ నిరోధక శక్తి తగ్గడం వల్ల ముప్పు అధికంగా ఉంటుంది. పొగాకు, మద్యం సేవించే వారు చలి కాలంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. వ్యాధిని ముందస్తుగా గుర్తిస్తే పూర్తి స్థాయి చికిత్స అందుబాటులో ఉంది. - డాక్టర్ రఘుకాంత్, పల్మనాజిస్టు, మెడికవర్ ఆస్పత్రి.

తల్లిపాలతో న్యుమోనియాను అడ్డుకోవచ్చు

సాధారణంగా తల్లిపాలతో బిడ్డలో రోగ నిరోధక శక్తి స్వతహాగా పెరుగుతుంది. తల్లిపాలు తాగిన పిల్లల్లో న్యుమోనియాను ఆరుసార్లు అడ్డుకునే శక్తి శిశువులో ఉంటుంది.

ప్రభుత్వం టీకాలను పిల్లలకు పూర్తి ఉచితంగానే ఇస్తుంది. వ్యాక్సినేషన్ 80శాతం దాటితే న్యుమోనియా బారినుంచి పిల్లలను కాపాడుకోవచ్చు. చల్లగాలి, పొగ, పెద్దవారిలో ఉన్న ఇన్ఫెక్షన్స్ ద్వారా పిల్లలకు న్యుమోనియా సోకుతుంది. 5 ఏండ్లలోపు వయస్సుగల పిల్లల్లో మరణాలు ఎక్కువగా సంభవిస్తుంటాయి. గతంలో ప్రధానిని కలిసినప్పుడు న్యుమోకోకల్‌ను ప్రభుత్వ టీకా షెడ్యూల్‌లో చేర్చాలని కోరాను. చలి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి. ప్రారంభదశలోనే హాస్పిటల్‌కు తీసుకువస్తే 99శాతం నయం చేయవచ్చు. ఆలస్యమైతే ప్రమాదం.

# దైవారాధనలో రాగి పాత్ర

ఈ రోజుల్లో కూడా పూజాది కార్యక్రమాలకి వెండి, బంగారు పాత్రలు ఉపయోగించే వారు లేకపోలేదు. అయితే ఒకప్పటికంటే ఇప్పుడు అలాంటివారి సంఖ్య తగ్గిందనే చెప్పాలి. ఇక మధ్యతరగతి వారు కూడా ఇత్తడి - రాగి పాత్రలను వాడటం చాలావరకు తగ్గించారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఎవరి ఇంట్లో చూసినా స్టీలు పాత్రలే దర్శనమిస్తున్నాయి. పూజకి ఉపయోగించే అన్ని రకాల పాత్రలు నేడు స్టీలులోనే కనిపిస్తున్నాయి. నగిషీ కారణంగా స్టీలు ... ఇనుము అనే భావన కలగనీయదు. ఈ కారణంగానే దీని వాడకం అంతకంతకూ పెరుగుతూపోతోంది.అయితే ఇటు ఆరోగ్యపరంగాను ... అటు ఆధ్యాత్మిక పరంగాను స్టీలు పాత్రలను వాడకూడదని శాస్త్రం చెబుతోంది.

**పూజలకు స్టీల్ పనికిరాదు:**

స్తోమత వుంటే వెండి - బంగారం, లేదంటే ఇత్తడి - రాగి పాత్రలను వాడటమే అన్ని విధాలా మంచిదని చెబుతోంది. స్టీలు ( ఇనుము) శని సంబంధమైన లోహం కనుక, దానికి బదులుగా ఇతరలోహాలతో చేసిన పాత్రలను మాత్రమే పూజకు వాడాలనీ, అప్పుడే ఎలాంటి దోషాలు లేని పరిపూర్ణమైన ఫలితాలను పొందవచ్చని స్పష్టం చేస్తోంది.

**రాగితో ఆరోగ్యం బోలెడు:**

గతంలో రాగి చెంబు, రాగి బిందె, రాగి గ్లాసు, రాగి ప్లేటు ఇలా ఎక్కువగా రాగి వస్తువులనే వాడే వారు. కాని నేడు ఫ్యాషన్ ఎక్కువయ్యి ప్లాస్టిక్ వచ్చిపడింది. దాంతో రాగి పాత్రల వాడకం బాగా తగ్గిపోయింది. నీళ్ళు తాగాలంటే ప్లాస్టిక్ బాటిల్స్, లంచ్ బాక్సులు కూడా ప్లాస్టికే. నేటి ఇళ్ళు మొత్తం ప్లాస్టిక్ సామానుల మయమైపోయాయి. అయితే రాగి పాత్రలు వాడడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి.

రాగిలో యాంటి బ్యాక్టిరియల్ నేచర్ ఉంటుంది. రాగితో చేసిన పాత్రలలో సూక్ష్మ క్రిములు చేరే అవకాశం ఉండదు. కాబట్టి ఇందులో నిల్వచేసే పదార్థాలు చెడిపోయే అవకాశాలు చాలా తక్కువ. మనకి వచ్చే చాలా రోగాలకి నీటి కాలుష్యం ముఖ్యమైన కారణం. రాగి పాత్రలలో నీళ్ళు ఉంచితే అందులో క్రిములు చేరే అవకాశం చాలా అరుదు. అందుకే పాత రోజుల్లో రాగి బిందెలు వాడేవారు.

చెవులు కుట్టినప్పుడు కూడా చిన్న పిల్లలకి కొన్ని చోట్ల మొదటిసారి రాగి తీగలు చుడతారు. ఎందుకంటే పుండు పడకుండా ఉండటానికి. రాగికి వున్న ఆంటి బ్యాక్టిరియల్ లక్షణం పిల్లలకు ఆ ప్రమాదం రాకుండా చేస్తుంది.

గతంలో నీళ్ళు వేడి చేసుకోవడానికి రాగితో చేసిన బాయిలర్లు వాడే వాళ్ళు. ఇందులో వేడి చేసిన నీరు వాడడం వల్ల చర్మ సంబంధిత రోగాలు కూడా తగ్గేవని రుజువు చెయ్యబడ్డాయి.

రాగి చెంబులో రాత్రి నీరు వుంచి పగలు నిద్ర లేవగానే తాగితే చాలా చాలా మంచిది. అలా తాగితే కడు పులో వున్న చెడు అంతా మూత్రం ద్వారా బయటకి వచ్చేస్తుందట. ఈ అలవాటు వల్ల గ్యాస్, కిడ్నీ, లివర్ సమస్యలు కూడా తగ్గిపోతాయి. బ్రిటిష్‌కి చెందిన ఒక యూనివర్సిటీ వాళ్ళు కూడా రాగిపాత్రలలో ఉంచిన నీటిపై పరిశోధన జరిపి పైన పేర్కొన్న విషయాలు నిజమని నిరూపించారు.

**పరగడుపున రాగి పాత్రలో నీళ్లు:**

రాత్రి రాగి చెంబులో మంచి నీళ్ళు వుంచి పరగడుపున తాగితే హాయిగా జీవించవచ్చు. రాత్రి నిద్ర పోయేముందు అర లీటర్ నుండి లీటర్ ఉండే రాగి చెంబు నిండా మంచినీళ్ళు పోసి మంచం పక్కనే పెట్టుకోవాలి ఉదయం నిద్ర లేచి లేవగానే రెండు సార్లు పుక్కిలించి ఊసి ఆ రాగి చెంబులోని నీళ్లు తాగాలి . దీనివల్ల 15 నిమిషాల నుండి అర గంటలోపు సుఖ విరోచనం అవుతుంది. గ్యాస్, కడుపుబ్బరము, కడుపులో మంట, మలబద్ధకం, తేపులు, మొదలైన బాధలన్నీ ఈ అలవాటుతో ఎటువంటి ఔషదాలు వాడే పని లేకుండా పూర్తిగా తగ్గిపోతాయి.

# ఏపీఈపీడీసీఎల్ సిబ్బందికి మూడ్రోజుల శిక్షణా తరగతులు

## - తొలిరోజు కార్యక్రమాన్ని ప్రారంభించిన సిఎండి కె.సంతోషరావు



సీతమ్మధార (విజయభాను న్యూస్) : భారత ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వ శాఖ ప్రారంభించిన ఆర్డీఎస్ఎస్ పథకంలో భాగంగా ఎన్పీటీఐ బెంగళూరు వారి ఆధ్వర్యంలో మూడ్రోజుల ఆన్ సైట్ శిక్షణ కార్యక్రమాన్ని ఏఎమ్ఐ సిస్టం, ప్రాజెక్ట్ మేనేజ్ మెంట్ కింద విశాఖలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఈ నెల 22వ తేదీ నుంచి 24వరకు నిర్వహించనున్నారు. తొలిరోజు కార్యక్రమాన్ని ఈపీడీసీఎల్ సిఎండి కె.సంతోషరావు మంగళవారం ప్రారంభిస్తూ ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఉద్యోగులు ఉపయోగించుకొని వారి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమానికి ఏపీఈపీడీసీఎల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఏ.వి.వి.సూర్య ప్రతాప్, చీఫ్ జనరల్ మేనేజర్ జె.శ్రీనివాసరావు, ఎన్ పిటీఐ (బెంగళూర్) డైరెక్టర్ ఎం.రవిచంద్రబాబు, డిప్యూటీ డైరెక్టర్ అల్లం శ్రీనివాసులు హాజరయ్యారు.





# మార్గశిర మాస ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలి

## జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : మార్గశిర మాస ఉత్సవాల సందర్భంగా తేది 24-11-2022 నుండి 23-12-2022 వరకు శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం నందు నిర్వహించబడు ప్రత్యేక ఉత్సవాలలో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా పగడ్బంది ఏర్పాట్లు గావించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాధన్ అన్నారు. మంగళవారం సాయంత్రం శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం నందు వివిధ శాఖల అధికారులతో కో- ఆర్డినేషన్ కమిటి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మసోత్సవాల ఏర్పాట్లు గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన ట్రాఫిక్ మళ్లింపు, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు, ఆర్.టి.సి.బస్సుల మళ్లింపు, భక్తులకు ఇబ్బంది కలగకుండా క్యూలైన్ లు ఏర్పాటు తదితర విషయాలపై పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదే విదంగా దేవస్థాన పరిసర ప్రాంతాలలో బ్లీచింగ్ చేయడం, క్లీనింగ్, డస్ట్ బిన్ ల ఏర్పాటు, భక్తులకు ఇబ్బంది లేకుండా మంచినీటి సరఫరా తదితర విషయాలపై జి.వి.ఎం.సి అధికారులను అడిగి తెలుసుకున్నారు. దేవస్థాన పరిసర ప్రాంతాలలో విధ్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం సుమారు 100 బస్సులు పోస్టాఫీసు వరకు నడుపుతున్నామని ఆర్.టి.సి. అధికారులు జాయింట్ కలెక్టర్ కు తెలిపారు. అదే విధంగా మార్గశిర మాస ఉత్సవాలకు సంబందించి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తామని అన్నారు. భక్తులకు అన్నధాన ఏర్పాట్లు, ఉత్సవాల విధులు నిర్వహిస్తున్న వివిధ శాఖల ఉద్యోగులకు భోజన ఏర్పాట్లు, భక్తుల ఉచిత క్యూలైన్ల ఏర్పాటు, రూ.100/-, రూ 200/- మరియు రూ.500/- టికెట్ల దర్శన క్యూలైన్ల ఏర్పాట్లు గురించి దేవస్థాన అధికారులు జాయింట్ కలెక్టర్ కు వివరించారు.






ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసారు.

అనంతరం జాయింట్ కలెక్టర్ భక్తులకు ఏర్పాటు చేసిన క్యూలైన్లను, దర్శన అనంతరం బైటకు వెళ్లే మార్గం, ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు, టికెట్ల విక్రయు కౌంటర్లు, ఉచిత అన్నదాన ప్రదేశం, శానిటేషన్, మరుగుదొడ్ల ఏర్పాట్లను స్వయం గా పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థాన చైర్మన్ కొల్లు సింహాచలం, కార్యనిర్వాహణాధికారి శ్రీమతి కె.శిరీష, జి.వి.ఎం .సి జోనల్ కమిషనర్ చక్రవర్తి,జిల్లా వైద్యాధికారిణి కె.విజయలక్ష్మి, పోలీసు అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విశాఖ ఎంపీ ఎంవివి కి వినతి



ములగాడ (విజయభాను న్యూస్) : హిందుస్తాన్ షిప్ యార్డ్ ఎస్ సి ,ఎస్ టి ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు మంగళవారం విశాఖ ఎంపీ ఎం వి వి సత్యనారాయణను మర్యాద పూర్వకంగా కలిసి షిప్ యార్డ్ లో ఉన్న సమస్యలను తెలియజేసారు. షిప్ యార్డ్ లో ఉన్న ప్రధాన సమస్య ఎల్ అండ్ ఎం సీరీస్ రెగ్యులర్ విషయం యార్డ్ ఆవరణలో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహం ప్రతిష్టించేలా యాజమాన్యంతో మాట్లాడి సమస్య పరిష్కరానికి కృషి చేయాలని ఎం పి ని కోరారు. స్పందించిన ఎం పి ఎం వి వి సత్యనారాయణ షిప్ యార్డును సందర్శించి కార్మికుల సమస్యలు పరిష్కరించేలా డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని నెలకొల్పేలా యాజమాన్యంతో మాట్లాడి సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేస్తానని తెలియజేసినట్లు తెలిపారు. ఎం పి ని కలిసిన వారిలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు వై శ్రీనివాసరావు , ప్రధాన కార్యదర్శి కె.అనిల్ కుమార్, అధ్యక్షులు కె.అప్పలకొండ, అడిషనల్ సెక్రటరీ పి.అనిల్ కుమార్ ఇతర కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

# అయ్యప్ప భక్తులకు ఊరట.. విమానాల్లో ఇకపై 'ఇరుముడి'ని వెంట తీసుకెళ్లొచ్చు

దిల్లీ: శబరిమలకు విమానాల్లో వెళ్లే అయ్యప్ప భక్తులకు ఊరట కలిగించే విషయం. అయ్యప్ప భక్తులు ఇకపై ఇరుముడి ని విమాన క్యాబిన్‌లోనే తమవెంట తీసుకువెళ్లొచ్చు. ఇందుకు బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ అనుమతించింది. ఎయిర్‌పోర్టులో అన్ని తనిఖీలు ముగిసిన తర్వాత.. ఇరుముడిని క్యాబిన్‌లోకి తీసుకెళ్లేందుకు అయ్యప్ప భక్తులకు అనుమతించాలని అన్ని విమానాశ్రయ భద్రతా సిబ్బందికి సర్క్యులర్ జారీ చేసింది. అయితే, మండలం, మకరజ్యోతి) దీక్షలు పూర్తయ్యే వరకు మాత్రమే (జనవరి 20వ తేదీ) ఈ వెసులుబాటు ఉంటుందని బీసీఏఎస్ స్పష్టం చేసింది.

శబరిమలలోని అయ్యప్ప ఆలయాన్ని దేశవ్యాప్తంగా ప్రతి ఏడాది లక్షల మంది భక్తులు సందర్శిస్తుంటారు. ఈ క్రమంలో అయ్యప్పకు సమర్పించేందుకు పవిత్రమైన 'ఇరుముడి' (నెయ్యి, కొబ్బరికాయ, ఇతర పూజ సామగ్రి)ని దీక్షలో ఉన్న భక్తులు తీసుకెళ్తారు. అయితే, ప్రస్తుత నిబంధనల ప్రకారం, మండే స్వభావం ఉన్నందున కొబ్బరికాయలను క్యాబిన్ లగేజీలో (ప్రయాణికుడితోపాటు) తీసుకెళ్లేందుకు అనుమతి లేదు. భక్తుల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకొని.. వచ్చే ఏడాది జనవరి 20 వరకు ఇరుముడిని తమతోపాటే క్యాబిన్‌లో తీసుకెళ్లేందుకు అయ్యప్ప భక్తులకు వెసులుబాటు కల్పిస్తున్నట్లు పౌరవిమానయాన శాఖ భద్రతా విభాగం (బీసీఏఎస్) నిర్ణయం తీసుకుంది.

# పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుంది

## - విశాఖ ఎయిర్ పోర్ట్ అడ్వైజరి కమిటీ మెంబర్ గా అంబటి శైలేష్ నియామకం



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం నాయుకుడు అంబటి శైలేష్ విశాఖపట్నం ఎయిర్ పోర్ట్ అడ్వైజరీ కమిటీ మెంబర్ గా నియమితులయ్యారు. ఈ ఉత్తర్వులు మంగళవారం ఎయిర్ పోర్ట్ అదారిటీ వారు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా అంబటి శైలేష్ మాట్లాడుతూ పార్టీ కోసం నమ్ముకున్నా సిద్ధాంతాన్ని మరువకుండా పనిచేసిన ప్రతి ఒక్కరికి పదవులు వాటి అంతట అవే వస్తాయని శైలేష్ తెలియజేశారు. నాపై నమ్మకంతో ఈ పదవి రావడానికి సహకరించిన విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎంవివి సత్యనారాయణ కి మరియు విశాఖ ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త నెడ్ క్యాప్ చైర్మన్ కేకే రాజు కి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు అంబటి శైలేష్ తెలిపారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు మరింత ఉత్సాహంగా పనిచేసే పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

# మూడో టీ20 టై.. టీమ్‌ఇండియాదే సిరీస్



మ్యాచ్‌ను అంపైర్లు ఆపేశారు. 161 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన భారత్ మ్యాచ్ ఆగిపోయే నాటికి 75/4 స్కోరుతో ఉంది. దీంతో డక్‌వర్త్‌లూయిస్ పద్ధతి ప్రకారం మ్యాచ్ టైగా ముగిసింది. తొలుత బ్యాటింగ్ చేసిన కివీస్ 19.4 ఓవర్లలో 160 పరుగులకు ఆలౌటైంది. నాలుగు వికెట్లతో కీలక పాత్ర పోషించిన మహమ్మద్ సిరాజ్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అందుకొన్నాడు.

### పంత్ మళ్లీ విఫలం

బౌలర్లు కష్టపడి కివీస్‌ను 160 పరుగులకే కట్టడి చేసిన ఆనందం కాసేపు భారత అభిమానులకు నిలవలేదు. రెండో టీ20లో అద్భుతంగా ఆడిన ఇషాన్ కిషన్ (10)తోపాటు రిషభ్ పంత్ (11), సూర్యకుమార్ యాదవ్ స్వల్ప వ్యవధిలో పెవిలియన్‌కు చేరడంతో భారత్ పీకల్లోతు కష్టాల్లో పడింది. అయితే మరోవైపు కెప్టెన్ హార్దిక్ పాండ్య (30 నాటౌట్: 18 బంతుల్లో 3 ఫోర్లు, ఒక సిక్స్) దూకుడుగా బ్యాటింగ్ చేశాడు. దీంతో 9 ఓవర్లకు నాలుగు వికెట్ల నష్టానికి 75 పరుగులు చేసింది. ఈ క్రమంలో వర్షం రావడం టీమ్‌ఇండియాకి కలిసొచ్చింది. డక్‌వర్త్‌లూయిస్ పద్ధతి ప్రకారం 76 పరుగులు చేస్తే విజయం.. 75 చేస్తే టైగా ముగుస్తుంది. భారత్ సరిగ్గా 75 చేయడంతో ఓటమి నుంచి తప్పించుకొంది. కివీస్ బౌలర్లలో సౌథీ 2.. మిల్నే, ఐష్ సోధి చెరో వికెట్ తీశారు.

కివీస్ ఆరంభంలోనే ఫిన్ అలెన్ (3) వికెట్‌ను చేజార్చుకొంది. అయితే చాప్‌మన్ (12)తో కలిసి మరో ఓపెనర్ డేవన్ కాన్వే (59) ఇన్నింగ్స్‌ను నిలబెట్టేందుకు ప్రయత్నించాడు. అయితే చాప్‌మన్‌ను సిరాజ్ బుట్టలో వేశాడు. కానీ ఆ తర్వాత క్రీజ్‌లోకి వచ్చిన గ్లెన్ ఫిలిప్స్ (54) వీరవిహారం చేశాడు. కాన్వే-ఫిలిప్స్ కలిసి మూడో వికెట్‌కు 86 పరుగులు జోడించారు. దీంతో కివీస్ స్కోరు 200 పరుగులకు వెళ్తుందేమోనని భారత అభిమానుల్లో కలవరం రేగింది. అయితే సిరాజ్ (4/17), అర్ష్‌దీప్ సింగ్ (4/37) విజృంభించడంతో కేవలం 30 పరుగుల వ్యవధిలో ఎనిమిది వికెట్లను కివీస్ చేజార్చుకొంది.

### ఇది భారత్‌కు తొలిసారి.. మొత్తంగా మూడోసారి

వర్షం కారణంగా మ్యాచ్ ఆగిపోయి టైగా ముగియడం భారత టీ20 చరిత్రలో ఇదే తొలిసారి. అయితే అంతర్జాతీయంగా మాత్రం మూడో మ్యాచ్ కావడం గమనార్హం. గతేడాది (2021) నెదర్లాండ్స్ x మలేషియా... మాల్టా x మార్సా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లు ఇలా టైగా ముగిశాయి.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com